PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 150 | విజయవాడ, మంగళవారం 2 జనవరి 2024 | 6 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 2 January 2024 | Rs



నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్తున్న పిఎస్ఎల్వి-సి 58 రాకెట్



కొచ్చిలో సోమవారం కెస్మార్ట్ యాప్‌ను ప్రారంభిస్తున్న కేరళ సిఎం పినరయి విజయన్

పిఎస్ఎల్వి-సి 58 సక్సెస్

ఈ ఏడాది మానవ రహిత గగన్‌యాన్ : ఇస్రో చైర్మన్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి తొలి ఎక్స్‌రే పొలారిమీటర్ (పిఎస్ఎల్వి-సి 58) రాకెట్ ద్వారా ఎక్స్‌పో శాట్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. సోమవారం ఉదయం 9.10 గంటలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకుపోయింది. భూమికి 650 కిలోమీటర్ల దూరంలో నిర్ణీత కక్ష్యలోకి ఎక్స్‌పో శాట్ ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు చేర్చారు. దీనిలోని సోలార్ ప్యానళ్లు బ్యాటరీలను ఛార్జింగ్ చేసే పని ప్రారంభించాయి. 480 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం నిర్ణీత కక్ష్యలో ఐదేళ్లపాటు పని చేయనుంది. ఎక్స్ కిరణాలపై అధ్యయనం చేయనుంది. టెలిస్కోప్‌లా అంతరిక్ష రహస్యాలు ఛేదించనుంది. కేరళ విద్యార్థులు తయారుచేసిన ఐవివై నానో ఉపగ్రహాన్నీ విజయవంతంగా ప్రయోగించారు. ఈ విజయం ద్వారా భారత ప్రజలకు ఇస్రో బహుమతి ఇచ్చిందని ఆ సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్, సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు.

కె-స్మార్ట్‌ను ఆవిష్కరించిన కేరళ

కొచ్చి : కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కె-స్మార్ట్‌ను ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ప్రారంభించారు. కొచ్చిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కె-స్మార్ట్ యాప్‌ను విజయన్ ప్రారంభించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇటువంటి యాప్‌ను దేశంలోనే తొలిసారిగా కేరళలో రూపొందించారు. రాష్ట్రంలో వివిధ పట్టణాల్లో కూడా కె-స్మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిగాయి. కొచ్చిలో ప్రారంభోత్సవం సందర్భంగా విజయన్ మాట్లాడుతూ 'కె-స్మార్ట్ యాప్‌తో స్థానిక స్వపరిపాలన సంస్థలు అందించే సేవలన్నీ ఒకే ప్లాట్‌ఫారమ్‌లో డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చాయి' అని తెలిపారు. ఈ యాప్‌తో ముఖ్యంగా 40 లక్షల మంది ప్రవాస కేరళీయులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.. ఇది ఒకే క్లిక్‌తో స్థానిక సంస్థలకు చెందిన అన్ని సేవలను అందుబాటులోకి తీసుకుని వస్తుందని అన్నారు. కేరళ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని తరగతులకు చెందిన ప్రజలందరూ కూడా అధునిక సాంకేతికత వృద్ధిని వినియోగించుకునే విధంగా అడుగులు వేస్తోందని, రాష్ట్రంలో దాదాపు 45 వేల తరగతి గదులను హైటెక్‌గా మార్చడమే ఇందుకు ఉదాహరణగా ముఖ్యమంత్రి విజయన్ గుర్తు చేశారు. అలాగే 2023లో అన్ని పంచాయితీల్లో ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ లోకల్ గవర్నెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా దాదాపు 250 సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ వ్యవస్థతో ఏడాదికి సుమారు ఒక కోటి ఫైళ్లపై నిర్ణయాలు తీసుకోవచ్చనని ముఖ్యమంత్రి తెలిపారు. పబ్లిక్ ప్రదేశాల్లో ఉచిత వై-ఫై ప్రాజెక్టు అయిన కె-ఫీలో భాగంగా ఇప్పటి వరకూ 2 వేలకు పైగా హాట్‌స్పాట్లను గుర్తించామని తెలిపారు.

3న కలెక్టరేట్ల ముందు బైఠాయింపు

- అంగన్‌వాడీ సంఘాల హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల మూడోతేదీన అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు బైఠాయిస్తామని అంగన్‌వాడీ సంఘాల నాయకులు హెచ్చరించారు. సోమవారం ఉదయం దుర్గాపురంలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) రాష్ట్ర కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడారు. కలెక్టరేట్ల ముట్టడిలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అంగన్‌వాడీలకు వారు పిలుపునిచ్చారు. 20 రోజులుగా సమ్మె జరుగుతున్నా మూడుసార్లు చర్చలు జరిపినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలకు, ఎంపిలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు ఇచ్చారని, అయినా వారెవరూ సిఎం దగ్గర సమస్యలను ప్రస్తావించకపోడం, సెంటర్లను తాత్కాలికంగా సచివాలయ సిబ్బందికి అప్పగిస్తామని చెప్పడం తగదని తెలిపారు. చర్చలకు వెళ్లిన సమయంలో వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు చేసేదాకా సమ్మెను విరమించబోమని స్పష్టంగా తెలియజేసినప్పటికీ నేటి వరకు మంత్రుల కమిటీ సిఎం దృష్టికి తీసుకెళ్లకుండా నాన్చుతూ అవాస్తవాలు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో అయినా అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మల వేతనాలు పెంపు, గ్రాట్యుటీ వంటి అంశాలపై సిఎం ప్రకటన చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలిసివచ్చే సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, పార్టీలను కలుపుకుని సమ్మెను తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో సిఐటియు అనుబంధం అంగన్‌వాడీ సంఘం నాయకులు ఎన్.సి.హెచ్.సుప్రజ, ఎల్లారాణి, జ్యోతి, ఎఐటియుసి అనుబంధ సంఘ నాయకులు పుష్పలత, ఐఎఫ్‌టియు అనుబంధ సంఘ నాయకులు గంగావతి తదితరులు పాల్గొన్నారు. డిసెంబర్ 12నుండి సమ్మె చేస్తున్నా, న్యాయమైన తమ డిమాండ్లు ఇంతవరకు పరిష్కారం కాని నేపథ్యంలో, తమ సమ్మెకు మద్దతు ఇచ్చి సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని వివిధ పార్టీలను కోరుతూ రాసిన లేఖలను మీడియాకు విడుదల చేశారు.

పర్యావరణ అధ్యయనానికి ముందే

'జల విద్యుత్' అనుమతులు

• రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ ఆదేశం • వ్యతిరేకిస్తున్న పర్యావరణ నిపుణులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



నదీ పరివాహక ప్రాంతం సామర్థ్యం, ప్రభావ అంచనాపై అధ్యయనం జరగక ముందే ప్రతిపాదిత జలవిద్యుత్ (హైడ్రో) ప్రాజెక్టులకు సూత్రప్రాయంగా అనుమతి ఇవ్వొచ్చని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనిని పర్యావరణ నిపుణులు వ్యతిరేకిస్తున్నారు. పర్యావరణ ప్రభావం గురించి అధ్యయనం జరిపిన తరువాతే జల విద్యుత్ ప్రాజెక్టు గురించి ఆలోచించాలని 2013 పర్యావరణ చట్టం(సవరణ) స్పష్టం చేస్తోంది. దీనికి విరుద్ధంగా ఈ ఆదేశాలున్నాయి.

'వన్ (సంరక్షణ్ ఏవం సంవర్ధన్) అధినియం-1980 కింద అనుమతి మంజూరుకు సమయం తీసుకుంటుంది. కనుక కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు (ఎంఇఎఫ్సిసి) శాఖ అటవీ సంరక్షణ విభాగం అధినియం కింద 'సూత్రప్రాయంగా' ఆమోదం మంజూరు చేయొచ్చని తెలిపింది.నదీ పరివాహక ప్రాంతంలో ఒకటి కంటే ఎక్కువ జలవిద్యుత్ ప్రాజెక్టులను మంజూరు చేయాలంటే దాని సామర్థ్యం, పర్యావరణ ప్రభావ అధ్యయనాలు తప్పనిసరి అని మంత్రిత్వశాఖ తెలిపింది. కొత్త ప్రాజెక్టుల మంజూరుకు ఈ నిబంధనలు వర్తిస్తాయని మంత్రిత్వశాఖ పేర్కొంది. 'చట్ట ప్రకారం నదీ పరివాహక ప్రాంతాల ప్రభావ అంచనా లేకుండా అటువంటి ఏదైనా ప్రాజెక్ట్ కోసం సూత్రప్రాయంగా ఆమోదం తెలపడమంటే పర్యావరణ భద్రతలను బలహీనపరచడమేనని అన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

- ముగ్గురు కాల్చివేత
- లోయ జిల్లాల్లో కర్ఫ్యూ విధింపు

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపబడ్డారు, దీంతో లోయ జిల్లాల్లో కర్ఫ్యూ కర్ఫ్యూ విధించారు. ఈ ఘాతుకానికి పాల్పడిందెవరో ఇంకా నిర్ధారించలేదని అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం కొందరు సాయుధ దుండగులు ముఖ్యపెట్టే దుస్తుల్లో వచ్చి స్థానికులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని, ఈ కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు, మరో అయిదుగురు గాయపడ్డారని లీసులు తెలిపారు. దాడి వెనుక ఉన్న వారిని పట్టుకుని శిక్షిస్తామని ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తెలిపారు. దాడి అనంతరం కోపోద్రిక్తులైన స్థానికులు మూడు నాలుగు చక్రాల వాహనాలకు నిప్పు పెట్టారు. శాంతి భద్రతలను కాపాడడంలో ఘోరంగా విఫలమైన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్షాలు మరోసారి డిమాండ్ చేశాయి. కుకీ, మెయితీ మధ్య విభజన తీసుకొచ్చి రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి యత్నిస్తోందని ఆయన తెలిపారు.

నేడు 'మున్సిపల్'చర్చలు

- హెల్త్ అలవెన్స్ జిఓ విడుదల
- పార్కు వర్కర్లను చేర్చాలన్న సిఐటియు
- మిగిలిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. నేడు (మంగళవారం) చర్చలు జరగనున్నాయి. ఈ మేరకు డిఎంఎ ఆఫీసునుండి సమాచారం అందినట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్మికసంఘాలతో జాయింట్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఆ సమాచారంలో పేర్కొన్నారని, ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి ఆదిమూలం సురేష్‌తోపాటు, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కూడా పాల్గొంటారని తెలిపారని చెప్పారు. ఈ సమావేశంలోనైనా మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. అంతకుముందు శానిటేషన్ డ్రైవర్లు, యుజిడి వర్కర్లు, మలేరియా కార్మికులకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ చెల్లించేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్ కార్మిక సంఘాలు ఇచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ ఉత్తర్వులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వెంటనే ఇది అమల్లోకి వస్తుందని, జిఓలో పేర్కొన్న మూడు విభాగాల సిబ్బందికి నెలకు రూ.6000 చొప్పున చెల్లిస్తామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పార్కుల్లో పనిచేసే వర్కర్లకు కూడా హెల్త్ అలవెన్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రికి లేఖ రాశారు. డిసెంబర్లో సమ్మె ప్రారంభమైన తరువాత 28వ తేదీన సంఘ నాయకులతో చర్చలు జరిపారని, అంతకుముందు 2023 డిసెంబరు 14వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి చర్చించారని పేర్కొన్నారు. ఈ రెండు సందర్భాల్లో యుజిడి, డ్రైవర్లు, మలేరియా కార్మికులతోపాటు పార్కులో పనిచేసే సిబ్బందికి ఓహెచ్ఎ మంజూరు చేస్తామని హామీనిచ్చారని జిఓలో అది లేదని తెలిపారు. 31వ తేదీన పంపించిన మినిట్స్‌లోనూ అంగీకరించినట్లు ప్రస్తావించారని తెలిపారు. అయినా జిఓలో పార్కు వర్కర్లను చేర్చకపోవడం సరికాదని, వెంటనే జిఓను సరిదిద్ది వారిని కూడా చేర్చాలని కోరారు. అదే సమయంలో మున్సిపల్ వర్కర్ల మిగిలిన డిమాండ్లను కూడా పరిష్కరించాలని, అంతవరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సమాజాన్ని మార్చాలంటే పుస్తకాలు చదవాలి

- మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్
- విజయవాడలో పుస్తక ప్రియుల పాదయాత్ర

ఆర్‌టిసికి 1,500 కొత్త బస్సులు

- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

పారిశుధ్య కార్మికులకు బెదిరింపులు

- మీ సంగతి తేలుస్తామంటూ హెచ్చరికలు

లోపలి పేజీలో..

చెప్పిందే చేస్తాను...

- సంస్కరణలతో అత్యుత్తమ పాలన
- అధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం
- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తాను చెప్పిందే చేస్తానని, చెప్పేది ఒకటి, చేసేది వేరొకటి ఉండదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిపాలనా సంస్కరణలతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా విశాల ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు. ఉన్నతాధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం అమలు చేస్తామన్నారు. మెట్రో, ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్టు వస్తున్న వార్తల్లో ఏ మాత్రమూ నిజం లేదని, గతంలో కంటే ఎక్కువ ప్రయోజనాలు చేకూరేలా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయంలో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సిఎం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మియా పూర్ నుంచి మైండ్ స్పేస్ వరకు ఉన్న మెట్రోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు



పొడిగిస్తామని చెప్పారు. తాము కొత్తగా ప్రతిపాదించబోతున్న మెట్రో కారిడార్లు గత ప్రభుత్వం ప్రతిపాదించిన ఖర్చుతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే పూర్తవుతాయని వివరించారు. ఫార్మా సిటీని పకడ్బందీగా ప్లాన్ చేస్తున్నామని, రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్య జీరో కాలుష్యంతో ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రత్యేక క్లస్టర్ల వద్ద పరిశ్రమల్లో పనిచేసే వారికి ఇళ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. యువతకు అవసరమైన నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తామని, అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన సంస్థలు, ప్రముఖ పారిశ్రామికవేత్తల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. వంద పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని, విదేశాలకు వెళ్లే యువతకు ఓరియంటేషన్ ఇప్పిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ శాఖలకు ప్రతిభ కలిగిన అధిపతులను నియమించడం వరకు సిఎంగా తాను చేస్తానని, వాళ్ల పరిధిలో అవసరమైన అధికారులను నియమించుకొని యంత్రాంగం సక్రమంగా పనిచేసేలా వారే చూసుకోవాలన్నారు.

నూతన సంవత్సరం రోజు విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం



పవన్



రాహుల్



శ్రీను

నూతన సంవత్సరం రోజున విషాదం చోటు చేసుకుంది. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. వారిలో ఆశా వర్కర్ కూడా ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.... నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేందుకు ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం పాపాయిపల్లి గ్రామానికి చెందిన గుజ్జుల శ్రీను (21), పిక్కిలి రాహుల్ (21), నల్లబోతుల పవన్ (20) ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మోటార్ సైకిల్‌పై గిద్దలూరు వైపు వెళ్తున్నారు. చెట్టిచెర్ల రోడ్డు హైవే వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని వారి మోటారు సైకిల్ బలంగా ఢీకొట్టింది. దీంతో, మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంక్ పగిలి బొలెరోపైనా, యువకులపైనా పెట్రోలు పడింది. మోటార్ సైకిల్‌ను నడుపుతున్న పవన్ మంటలు అంటుకొని అక్కడికక్కడే మృతి చెందారు. వెనక ఉన్న ఇద్దరు యువకులూ రోడ్డుపై పడడంతో తల పగిలి చనిపోయారు.

విజయవాడలోని మొఘల్రాజపురానికి చెందిన తలశీల కృష్ణ చైతన్య (24), నున్న గ్రామానికి చెందిన శెట్టి సాయికుమార్ (24), నున్న రాకేష్, మరో ఇద్దరు స్నేహితులు కలిసి ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కనసానపల్లి గ్రామంలోని రాకేష్ కుటుంబీకుల మామిడి తోటలో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకున్నారు. అనంతరం వీరిలో ముగ్గురు బుల్లెట్‌పైనా, మరో ఇద్దరు మోటారు సైకిల్‌పైనా బయలుదేరారు. కనసానపల్లి గ్రామ శివారులో బుల్లెట్‌కు గేదె అడ్డొచ్చింది. దానిని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ భూమిలోని నేల బావిలో బుల్లెట్‌తోపాటు పడిపోయారు. దీంతో, కృష్ణచైతన్య, సాయికుమార్ మృతి చెందారు. రాకేష్‌ను స్థానికులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. అనకాపల్లి మండలం తుమ్మపాల మెయిన్ రోడ్డులో నడుచుకొని వెళ్తున్న ఆశా కార్యకర్త తోటాడ అమ్మాజీ (55) సాయిబాబా ఆలయం వద్ద ఆటో ఢీకొనడంతో మృతి చెందారు. ఆమె తుమ్మపాల ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు ఆస్పత్రి వద్ద జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తోటి ఆశాలు మంగ, ప్రమీలకు గాయాలయ్యాయి.

జార్ఖండ్‌లో 'రేషన్ బంద్'

జార్ఖండ్ : ఆల్ ఇండియా ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ ఫెడరేషన్ (ఎఐఎఫ్‌పిఎస్‌డిఎఫ్) పిలుపుమేరకు సోమవారం జార్ఖండ్‌లో డీలర్లు సోమవారం బంద్ పాటించారు. జార్ఖండ్‌లోని 25,000 మందికి పైగా డీలర్లు బంద్‌లో పాల్గొన్నారు. డీలర్స్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్ మాట్లాడుతూ "ఇది దీర్ఘకాలం కొనసాగితే జాతీయ, రాష్ట్ర ఆహార భద్రతా పథకాల కింద లబ్ధిపొందుతున్న 65 లక్షల మందికి పైగా లబ్ధిదారులపై సమ్మె ప్రభావం చూపవచ్చు" అని తెలిపారు. డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్‌పిఎస్‌డిఎ) జార్ఖండ్ యూనిట్ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుందు పిటిఐతో మాట్లాడుతూ డీలర్లకు కనీస నెలవారీ ఆదాయ హామీని అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైనందుకు నిరసనగా 'రేషన్ బంద్'కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. డీలర్లకు కనీస నెలవారీ ఆదాయం రూ.50,000కు హామీ ఇవ్వాలని, ప్రపంచ ఆహార కార్యక్రమం సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్‌ను కిలోకు రూ.1 నుండి 3 కి పెంచాలని, డీలర్ మరణిస్తే కారుణ్య ప్రాతిపదికన కుటుంబ సభ్యునికి దుకాణం అందించాలని కోరారు.

జపాన్‌లో ఘోర భూ కంపం

- గంటన్నర వ్యవధిలో 21 సార్లు కంపించిన భూమి
- సునామీ హెచ్చరిక జారీ
- పలు ఇళ్లు ధ్వంసం.. మౌలిక సదుపాయాలు ఛిన్నాభిన్నం



భూకంపంతో జపాన్‌లో వాజిమా నగరంలో బీటలు వారిన భూమి

టోక్యో : నూతన సంవత్సర ప్రారంభ రోజే జపాన్‌లో పెను విపత్తు సంభవించింది. దేశంలోని పలు ప్రాంతాల్లో గంటన్నర వ్యవధిలో 21 సార్లు భూమి కంపించింది. దీంతో సముద్ర తీర ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలను జారీ చేశారు. భూ కంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4 పాయింట్లుగా నమోదయింది. ఇషికావా జిల్లాలోని నోటో ప్రాంతంలో భూ కంపనాభి ఉన్నట్లు గుర్తించారు. సముద్రపుటలలు 1.2 మీటర్ల నుంచి ఐదు మీటర్ల ఎత్తున ఎగసిపడ్డాయి. భూకంపం ధాటికి అనేక చోట్ల మౌలిక సదుపాయాలు చిన్నాభిన్నమయ్యాయి. ప్రాణభయంతో ప్రజలు పరుగులు తీశారు. భూకంపం ధాటికి అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. వాజిమా నగరంలో 30 నివాస గృహాలు నేలమట్టమయ్యాయి. కొన్ని చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. జాతీయ రహదారులను మూసేశారు. ప్రజలను ఖాళీగా ఉన్న మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భూకంపం ప్రభావం ఎక్కువగా పడిన ఇషికావా జిల్లాలో 36 వేలకు పైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. సహాయ చర్యలలో పాల్గొనేందుకు సైన్యాన్ని రంగంలోకి దింపారు. జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. వాజిమాకు సుమారు 500 కిలోమీటర్ల దూరంలోని రాజధాని టోక్యోలో సైతం ఇళ్లు దెబ్బతిన్నాయి. అత్యంత వేగంతో నడిచే రైలు సర్వీసులను నిలిపివేశారు. ఇషికావా, టొయామా రాష్ట్రాలలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టెలికం, ఇంటర్నెట్ సేవలు కూడా నిలిచిపోయాయి. టొయామా, ఇషికావా నగరాలకు బయలుదేరిన విమానాలను వెనక్కి పంపారు. ఇషికావాలోని ఓ విమానాశ్రయాన్ని మూసివేశారు. అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. అయితే అణు విద్యుత్ ప్లాంట్లకు మాత్రం ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

టీవీ ఛానల్స్ సాధారణ ప్రసారాలను నిలిపివేసి ప్రత్యేక బులెటిన్లు ప్రసారం చేశాయి. ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని

మిగతా 5లో

ఆర్‌టిసికి 1,500 కొత్త బస్సులు

- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసికి ఈ ఏడాదిలో 1,500 కొత్త బస్సులు రానున్నాయని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. అలాగే ప్రైవేటుగా విద్యుత్ బస్సులు మరో వెయ్యి ఆర్‌టిసికి రానున్నాయని అన్నారు. సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆయన్ను ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. ఆర్‌టిసి పురోగతి కోసం ఉద్యోగుల కృషి అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలోని బస్టాండ్లను, డిపోలను ఆధునీకరించాల్సిన అవసరం వుందని తెలిపారు. ఈ మేరకు ప్రణాళికలు తయారవుతున్నాయని పేర్కొన్నారు. కొత్త ఏడాదిలో కూడా ఆర్‌టిసి ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ కోటేశ్వరరావు, పి కృష్ణమోహన్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఎస్‌కె జిలాని బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు 21 రోజుల సెలవులు

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులకు 2024లో 21 సాధారణ సెలవులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 1న నూతన సంవత్సరాది, 15న సంక్రాంతి, 16న కనుమ, 26న రిపబ్లిక్ డే, అలాగే మార్చి నెలలో 8న మహాశివరాత్రి, 29న గుడ్ ఫ్రైడే, ఏప్రిల్ 9న ఉగాది, 11న రంజాన్, 17న శ్రీరామనవమి, జూన్ 17న బక్రీద్, జులై 17న మొహర్రం, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, 26న శ్రీకృష్ణాష్టమి, సెప్టెంబరు 7న వినాయక చవితి, 16న మిలాడనబి, అక్టోబరు 2న గాంధీ జయంతి, 11న దుర్గాష్టమి, 12న విజయదశమి, 31న దీపావళి, నవంబరు 5న నాగులచవితి, డిసెంబరు 25న క్రిస్మస్ సెలవులను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

196 సబ్ వేరియంట్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ సబ్ వేరియంట్ జెఎన్-1 మొత్తం 196 కేసులు నమోదయ్యాయి. వేరియంట్ ఉనికిని గుర్తించిన రాష్ట్రాల జాబితాలో ఒడిషా కూడా చేరింది. పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సబ్ వేరియంట్ ఉనికిని గుర్తించారు. కేరళ (83), గోవా (51), గుజరాత్ (34), కర్ణాటక (8), మహారాష్ట్ర (7), రాజస్థాన్ (5), తమిళనాడు (4), తెలంగాణ (2), ఒడిశా (1), ఢిల్లీ (1) నమోదైనట్లు గుర్తించారు. ఇండియాలో కరోనా కేసులు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి. కొత్తగా 636 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య 4,394 కు పెరిగింది. ఈ మేరకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. మంత్రిత్వ శాఖ ఉదయం 8 గంటలకు నవీకరించిన డేటా ప్రకారం.. గత 24 గంటల్లో కేరళలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు కరోనాతో మరణించారు. గత ఏడాది డిసెంబర్ 5 నాటికి.. రోజువారీ కేసుల సంఖ్య రెండంకెలకు చేరింది. జలుబు, వైరస్ యొక్క కొత్త రూపం కారణంగా కేసులు మరింతగా పెరిగాయి. ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం.. ఇప్పటివరకు కరోనా నుండి కోలుకున్న వారి సంఖ్య 4.4 కోట్లు దాటింది. జాతీయ రికవరీ రేటు 98.81 శాతం ఉంది. మంత్రిత్వ శాఖ ప్రకారం.. దేశంలో కోవిడ్-19 వ్యతిరేక టీకా ప్రచారం కింద ఇప్పటివరకు 220.67 కోట్ల డోసులు ఇచ్చారు.


విజయవాడ ధర్నాచౌక్‌లో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకులు పి మధు


కడప జిల్లా కమలాపురంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ఆటలు, పాటలు, నిరసనలు

- కొత్త సంవత్సరంలో నూతనోత్సాహంతో ఉద్యమం
- 21వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం

కొత్త సంవత్సరం ప్రారంభం రోజునా అంగన్‌వాడీలు పోరుబాటలోనే ఉన్నారు. 21 రోజులుగా సమ్మెలో ఉన్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఆట, పాటలు, వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. కొత్త సంవత్సరానికి ఉద్యమ పదంతో స్వాగతం పలికారు. సమ్మె శిబిరాల్లో కేక్ కట్ చేశారు. వారి పోరాటానికి సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. కొత్త సంవత్సరంలోనైనా ముఖ్యమంత్రి మనసు మారి తమ వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్‌వాడీ, ఆయాలు విజయనగరం, శ్రీకాళహస్తి, రేణిగుంట, మునగపాక, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు మండలాల్లోని సమ్మె శిబిరాల్లో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు కోలాటం, పెందుర్తిలో కబడ్డీ, కోలాటం ఆడారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి, బుచ్చయ్యపేటల్లో కోలాటం, ఆటపాటలు, సోది, వీధి వేషాలతో, నర్సీపట్నంలో ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కబడ్డీ ఆడారు. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రంలో మహిషాసురమర్ధిని వేశధారణలో నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట కోలాటం ఆడారు. శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి, హిందూపురం, చిలమత్తూరు, పెనుకొండ, మడకశిరలో కోలాటం, కబడ్డీ, కర్నూలోని ధర్నా చౌక్‌లో మ్యూజికల్ చైర్స్, ఆదోనిలో కబడ్డీ, నంద్యాల జిల్లాలో ఆట, పాట, కోలాటంతో నిరసన తెలిపారు. తిరుపతిలో సాష్టాంగ నమస్కారం చేస్తూ నిరసన తెలిపారు. 'లేచింది మహిళా లోకం' పాటకు స్టెప్పులతో దుమ్ములేపారు. నెల్లూరులో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారులు వారితో జత కలిసి సంఘీభావం తెలిపారు. గుంటూరులో కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు ఉద్యమ గీతాలకు నృత్యాలు చేశారు. వారి పోరాటానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఐక్యంగా ఉండి సమ్మె కొనసాగించాలని సూచించారు. సమ్మె చేపట్టి 21 రోజులైన సందర్భంగా తెనాలిలో 21 సంఖ్య ఆకారంలో అంగన్‌వాడీలు కూర్చుని, ఫరంగిపురంలో 'చెడు వినవద్దు... చెడు కనవద్దు... చెడు చూడవద్దు' అనే సంకేతాలతో నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో చప్పట్లు కొట్టి, కబడ్డీ ఆడి, పిడుగురాళ్లలో సమ్మె శిబిరం వద్ద ముగ్గులు వేసి, ఆటలాడారు. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, కాళ్ల, పోడూరు, నరసాపురం, గణపవరం, ఉండి, మొగల్తూరు, పాలకొల్లు, పెనుగొండ, పాలకోడేరు తణుకు, ఆచంటలో వైఎస్ఆర్ విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు. పెనుమంట్రలో ఆటపాటలతో, వీరవాసరంలో చీపురు పట్టి రోడ్లు ఊడుస్తూ, ఏలూరు జిల్లాలో భీమడోలు, జీలుగుమిల్లిలో ఆటపాటలతో, కొయ్యలగూడెంలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కాకినాడ జిల్లా పెదపూడిలో ప్రభుత్వ విధానాలపై నృత్యరూపకం ప్రదర్శించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో కబడ్డీ ఆడారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట ఆట, పాట, కబడ్డీ, కోలాటం, పొర్లుదండాలతో, ఒంటి కాలుపై, మోకాళ్లపై నిల్చుని, విజయనగరం జిల్లా జామిలో మోకాళ్లపై నిల్చొని, గజపతినగరంలో కోలాటం ఆడి, పార్వతీపురంలో రంగవల్లులు వేసి, శ్రీకాకుళంలో జోస్యం చెప్తూ, కబడ్డీ ఆడి, టెక్కలిలో ఆట, పాటలతో నిరసన తెలిపారు.

అణచివేతలు కొత్తేం కాదు : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

అంగన్‌వాడీలకు ఉద్యమాలు, అణచివేతలు కొత్తేమీ కాదని, ఉమ్మడి రాష్ట్రంలో ఇంతకంటే ఎక్కువ బెదిరింపులను ఎదుర్కొని ఎన్నికల్లో ఆ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పారని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి గుర్తు చేశారు. బాపట్ల జిల్లా అద్దంకిలో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షమంది అంగన్‌వాడీలు ఉన్నారని, ఇంటికి మూడు ఓట్లు చొప్పున మూడు లక్షల ఓట్లు మళ్లిస్తే ప్రభుత్వం తారుమారవుతుందని హెచ్చరించారు.

ప్రభుత్వం మొండిపట్టు వీడాలి : ఉమామహేశ్వరరావు

ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా అంగన్‌వాడీల సమ్మెను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. బాపట్లలో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి వారి పోరాటానికి మద్దతు తెలిపారు.

అంగన్‌వాడీలతో చెలగాటమా?
మాజీ ఎంపి పి.మధు

అంగన్‌వాడీలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాధించలేదని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పి.మధు గుర్తు చేశారు. తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, ఆశా వర్కర్లు ఇలా లక్షలాదిమంది రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేస్తోన్నా, వారి సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి రానున్న కాలంలో వారు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ జిలాని బాషా, అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ యూనియన్లతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శిబిరం వద్ద అంగన్‌వాడీలు నూతన సంవత్సర ముగ్గులు వేసి నిరసన తెలిపారు.

విద్యుత్ సంస్థలకు 3 అవార్డులు

- సిఎం అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫాల్కన్ మీడియా అండ్ ఎనర్షియా ఫౌండేషన్ నిర్వహించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో రాష్ట్ర విద్యుత్ సంస్థలు మూడు అవార్డులు సాధించాయి. సాధించిన అవార్డులతో విద్యుత్‌శాఖ అధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం కలిశారు. ఈ అవార్డుల గురించి ముఖ్యమంత్రికి ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వివరించారు. క్లీన్, గ్రీన్ పునరుత్పాదక శక్తి ద్వారా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను ప్రోత్సహించడం, పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు, విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాలు కలిగి ఉన్నందుకు ఈ అవార్డులు వచ్చాయని తెలిపారు. విద్యుత్, మౌలిక సదుపాయాలు కలిగి ఉండటంలో ట్రాన్స్‌కోకు అవార్డు లభించిందన్నారు. పునరుత్పాదక విద్యుత్‌లో దేశంలో టాప్ నోడల్ ఏజెన్సీగా ఉన్నందుకు, అదే విధంగా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రచారం చేయడంలో ఎపి నెడ్‌క్యాప్ ఉత్తమంగా ఉన్నందుకు అవార్డు పొందిందని తెలిపారు. ఈ అవార్డులు సాధించినందుకు అధికారులను అభినందించారు.

రాష్ట్ర విద్యుత్ రంగాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపాలని జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జెఎమ్‌డి బి మల్లారెడ్డి, గ్రిడ్ డైరెక్టర్ ఎకెవి భాస్కర్, ఇంధనశాఖ జాయింట్ సెక్రటరీ బిఎవిపి కుమార్ రెడ్డి, నెడ్‌క్యాప్ ఎమ్‌డి రమణా రెడ్డి పాల్గొన్నారు.

సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సర సందర్భంగా పలువురు ప్రముఖులు సిఎం జగన్‌ను సోమవారం క్యాంప్ ఆఫీస్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం జగన్ కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు.


సిఎం క్యాంప్ ఆఫీస్‌లో నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సిఎం జగన్

నేటి నుంచి రెండో దశ 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- 6 నెలల్లో 13,459 ఆరోగ్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు
- ప్రతి ఇంటినీ రెండుసార్లు సందర్శించనున్న వలంటీర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో దశను మంగళవారం నుంచి నిర్వహించేందుకు వైద్యారోగ్యశాఖ సిద్ధమైంది. ఆరు నెలలపాటు నిర్వహించే రెండో దశ కార్యక్రమంలో 13,945 ఆరోగ్య శిబిరాలను నిర్వహించనుంది. తొలిదశలో నిర్వహించిన కార్యక్రమంలో 12,423 ఆరోగ్య శిబిరాల్ని నిర్వహించడం ద్వారా 1,64,982 మంది పేషెంట్లను వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించి వారికి ఉచిత వైద్య సేవల్ని అందించారు. రెండోదశ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఇళ్లల్లో ఉన్న దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలతోపాటు ప్రసవానంతర శిశు సంరక్షణ సేవలు, అన్ని వయసుల వారి ఆరోగ్య సమస్యలకు వైద్య సేవల్ని అందించనున్నారు. అవసరమైన సందర్భాల్లో నెట్వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి ఉచిత వైద్య సేవలు అందిస్తారు. ఆరోగ్య శిబిరం నిర్వహణ తేదీని ముందు ప్రతి వలంటీరూ రెండుసార్లు ప్రతి ఇంటికీ తిరిగి వివరాలను తెలియజేయాల్సి వుంటుంది. మొదటిసారి వైద్య శిబిర నిర్వహణకు 15 రోజుల ముందు, రెండోసారి శిబిర నిర్వహణ తేదీని గుర్తు చేసేందుకు మూడు రోజుల ముందు వలంటీర్లు ఇళ్లను సందర్శిస్తారు. వైద్య శిబిరాల్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణ, వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తారు. మొత్తం మండలాలను సమానంగా విభజించి మంగళవారం తొలి అర్ధభాగంలోనూ, శుక్రవారం మిగిలిన ప్రాంతాల్లోనూ శిబిరాల్ని నిర్వహిస్తారు. పట్టణ ప్రాంతాల్లో వార్డు సచివాలయాల్లో ప్రతి బుధవారం ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. ప్రతి ఆరోగ్య శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లతో కలిపి కనీసం ముగ్గురు డాక్టర్లు, ఒక పారామెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ బాధ్యతలు నిర్వహిస్తారు. రెండో దశ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో గ్రామీణ ప్రాంతాల కోసం 92 రకాల మందులు, పట్టణ ప్రాంతాల కోసం 152 రకాల మందులను సిద్ధం చేశారు. వీటితోపాటు అత్యవసర వినియోగం కోసం మరో 14 రకాల మందుల్ని, వైద్య పరీక్షల నిర్వహణ కోసం 7 రకాల కిట్లను సిద్ధంగా ఉంచినట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంది.

విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం

- వచ్చే ఏడాది నుంచి కార్యాచరణ
- బడ్జెట్ మాత్రం రూ.7 కోట్లే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది నుంచి దీనిని అమలులోకి తీసుకురానున్నారు. అలాగే పల్లె ప్రాంతాల్లో సామాజిక సేవారంగంలో కూడా విద్యార్థులు, యువత ఎక్కువగా పాలుపంచుకునేలా చూడాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి రానున్న బడ్జెట్‌లో నిధులు కూడా కోరాలని భావిస్తున్నారు. తొమ్మిదో తరగతి నుంచి పది, ఇంటర్, డిగ్రీ స్థాయి విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ (వ్యక్తిత్వ వికాసం)పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. భవిష్యత్తులో తమ కెరీర్‌ను మెరుగుపరుచుకునే దిశగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విధానాన్ని అన్ని విద్యా సంస్థల్లో అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభిస్తున్నారు.

తమ లక్ష్యాలను ఏర్పాటుచేసుకోవడం, వాటిని సాధించే దిశగా అడుగులు వేయడంపైనా ఈ తరగతుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవడం, తడబాటు లేకుండా ప్రసంగాలు చేయడం వంటి అంశాలపైనా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

విద్యార్థులు, యువతలో సామాజిక బాధ్యత, చైతన్యాన్ని కూడా పెంపొందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేసేలా శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఇంత భారీ ఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమానికి కేటాయించే నిధులు మాత్రం అతి తక్కువగా కనిపిస్తున్నాయి. ఏడాది పొడవునా నిర్వహించే ఈ పథకానికి కేవలం రూ.7.69 కోట్లు మాత్రమే యువజన సంక్షేమశాఖ ప్రతిపాదిస్తోంది. ఇది ఎంతమాత్రం సరిపోదని అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. వారు కోరిన దాంట్లో చివరకు ఆర్థికశాఖ ఎంత కేటాయిస్తుందనేది కూడా అనుమానంగానే ఉన్నట్లు వారు అంటున్నారు.



దాడిలో పగిలిన కార్యాలయం అద్దాలు

గుంటూరులో వైసిపి కార్యాలయంపై దాడి

- 32 మంది అరెస్టు
- ఓటమి భయంతో టిడిపి దాష్టీకం : మంత్రి రజని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో వైసిపి పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత టిడిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. కార్యాలయం వాచ్‌మెన్ ఫిర్యాదు మేరకు 32 మందిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేయడంతోపాటు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పోలీసుల కథనం ప్రకారం... వైసిపి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్తగా ఉన్న మంత్రి విడదల రజని స్థానిక సాయిబాబా రోడ్డు ఎదుట కార్యాలయం ఏర్పాటు చేశారు. సోమవారం ఈ కార్యాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో భారీ ఫ్లెక్సీలతో అలంకరణ చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని యువకులు పెద్ద సంఖ్యలో అక్కడే ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు చేరారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పించే క్రమంలో కొంతమంది యువకులు వైసిపి కార్యాలయంపై రాళ్ల దాడి చేశారు. ఈదాడిలో మొదటి, రెండంతస్తుల అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటనను మంత్రి విడదల రజని ఖండించారు. బిసి మహిళగా ఉన్న తన ఎదుగుదలను చూసి ఓర్వలేక, ఓటమి భయంతో తన కార్యాలయంపై టిడిపి గూండాలు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. నిందితులు ఎంతటి వారైనా ఒదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అయితే ఈ ఘటనను ఆసరాగా చేసుకుని టిడిపి కార్యాకర్తలపై అక్రమ కేసులు పెట్టారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. ఈ ఘటనపై న్యాయవిచారణ చేయాలని కోరారు. విడదల రజని గుంటూరు రావడం ఇష్టం లేకనే వైసిపి నాయకులు ఈ దాడి చేయించి ఉంటారని, ఇదే సమయంలో అక్కడున్న టిడిపి కార్యకర్తలను అరెస్టు చేశారని విమర్శించారు.

మద్యం అమ్మకాలు రూ.156 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా మద్యం అమ్మకాల జోరు కొనసాగింది. సాధారణ రోజుల్లో సగటున రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు వుండే మద్యం అమ్మకాలు డిసెంబరు 31న రికార్డు స్థాయిలో రూ.156.6 కోట్లు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలకు అనుమతులివ్వడంతో అమ్మకాలు రెట్టింపు స్థాయిలో జరిగాయి. ఈ అమ్మకాల్లో 1.51 లక్షల కేసుల మద్యం, 67 వేల కేసుల బీర్లు వున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

'ఉక్కు' పోరాటం ఆగదు

- అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపుతూ కేంద్ర కేబినెట్ తన నిర్ణయం ప్రకటించే వరకు పోరాటం ఆగదని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు ప్రతిజ్ఞ చేశాయి. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలంటూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో 1005 రోజులుగా నిర్వహిస్తున్న దీక్షా శిబిరం వద్ద నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం విశాఖ ప్రజలకు, కార్మిక వర్గానికి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అక్కడ ఉక్కు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ ఎం.మన్మధరావు మాట్లాడారు.

అదే పట్టుదల.. అదే స్ఫూర్తి

- కొనసాగుతున్న సమ్మె
- మొక్కవోని దీక్షతో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాలుగున్నరేళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ గత వారం రోజులుగా జరుగుతున్న సమ్మెలోనూ అదే స్ఫూర్తితో పాల్గొంటున్నారు. సమాన పనికి సమాన వేతనం వచ్చే వరకూ విరమించేది లేదంటూ తేల్చిచెబుతున్నారు. ప్రభుత్వం చర్చలు జరిపిన ప్రతిసారీ హామీలు ఇవ్వడం, అనంతరం పట్టించుకోకపోవడంతో సహనం కోల్పోయిన కార్మికులు సమ్మెబాట పట్టారు. పోటీ కార్మికులను తెచ్చి వారి కాంట్రాక్టర్లకు లక్షల రూపాయలు ఖర్చుపెట్టేందుకు సిద్ధమైన ప్రభుత్వం ప్రాణాలకు తెగించి పనులు చేస్తున్న కార్మికుల డిమాండ్లను నెరవేర్చేందుకు మాత్రం సిద్ధపడలేదు. అయినా కార్మికులు తెగించి సమ్మెలో కొనసాగుతున్నారు.

సమ్మె నేపథ్యంలో ఒకసారి చర్చలు జరిపిన మంత్రులు, నేడు మరోసారి సంఘాలను చర్చలకు ఆహ్వానించారు. ప్రజారోగ్య సిబ్బంది సమ్మెతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడం, కరోనా వ్యాపిస్తోందని వార్తలు రావడంతో ప్రభుత్వంలోనూ ఆందోళన మొదలైంది. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా ఏ మాత్రమూ వెనుకాడకుండా కార్మికులు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) నేతృత్వంలో ఎక్కువ మంది విజయవంతంగా సమ్మెను కొనసాగిస్తున్నారు. వీరితోపాటు ఎఐసిటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, ఎంఆర్‌పిఎస్ సంఘాల వారు కూడా సమ్మెలో ఉన్నారు. కార్మికుల సమ్మెతో సంబంధం లేదని ప్రకటించిన ఒకటీ రెండు సంఘాలు కూడా అనివార్యంగా సమ్మెలోకి రావాల్సి వచ్చింది. జగ్గయ్యపేట, కొండపల్లి, నూజివీడు లాంటి చోట్ల ఎఐటియుసి అనుబంధ సంఘం కార్మికులూ సమ్మెలోకి వస్తున్నారు. సిఐటియు నేతృత్వంలో సమ్మె తీవ్రమవడం, కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనడంతో గతంలో జనవరి 11 నుండి సమ్మెలోకి వెళతామని ప్రకటించిన సంఘాలు జనవరి మూడు నుండే మొదలు పెడతామని ప్రకటించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం కార్మిక సంఘాలను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది.

వైసిపి అధికారంలోకి రాకముందు ప్రతిపక్షనేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు అనేక హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తరువాత అమలులో జాప్యం జరిగింది. దీనిపై ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యాన నాయకులు దఫదఫాలుగా ఆందోళన చేపట్టారు. ఎంతో ఓర్పుతో పోరాటాలు సాగించారు. ఏడాది దాటినా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని నిరసనగా 2020 ఆగస్టు నాలుగోతేదీన మున్సిపల్ కార్మికులు ఒకరోజు సమ్మె చేపట్టారు. దీనిపై అప్పటి డిఎంఇ విజయకుమార్ నాయకులతో చర్చించారు. సమాన పనికి సమాన వేతనం, పర్మినెంటు, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్, బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చినట్లుగా కరోనా సమయంలో ఇన్సెంటివ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని రికమండ్ చేస్తూ లేఖ రాశారు. ఈ సమయంలో సిఐటియు అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సమ్మెలో పాల్గొందని ప్రస్తావించారు. అయినా స్పందన లేకపోవడంతో 2021 ఫిబ్రవరి 15, 16 తేదీల్లో రెండురోజులు సమ్మె నిర్వహించారు. ఫలితం లేకపోవడంతో 2022 జులై 11వ తేదీ నుండి 15వ తేదీ దాకా మరోసారి సమ్మె చేపట్టారు. వేతనాలు పెంచాలని, కోతపెట్టిన హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, జిఒఆర్‌టి 30 ద్వారా ఎనిమిది కేటగిరీలకు జరిగిన అన్యాయాన్ని సవరించాలని సిఐటియు అనుబంధం సంఘం పట్టుబట్టింది. చేస్తామని చెప్పినా ఇంతవరకు మార్పు చేయలేదు. వాస్తవంగా జిఒ నెంబరు 30 ఇచ్చింది తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే సమయంలో. వైసిపి పాలకులు దాన్ని కొనసాగిస్తున్నారే తప్ప ఇచ్చిన హామీ ప్రకారం మార్పులు చేయలేదు. దీనిపై మూడుసార్లు ఆర్థికశాఖకు సిఫార్సు చేసినా ఫలితం లేదు. జులైలో ఆందోళన సందర్భంగా మంత్రి ఇతర డిమాండ్ల గురించి మాట్లాడినా వేతనం పెంపు గురించి మాట్లాడలేదు. హెల్త్ అలవెన్స్‌పై ఆయనకు ఆయనే ప్రకటించి వెళ్లిపోయారు. దీంతో అన్ని సంఘాలనూ కూడగట్టిన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) 2022లో మరోసారి ఆందోళనకు దిగింది. 11వ పిఆర్‌సి మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలని కోరారు. శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు జరపకూడదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. అప్పుడు కూడా మంత్రులు హామీనిచ్చారే తప్ప పరిష్కరించలేదు.

జోరువానలోనూ దీక్షలు చేపట్టారు. 2021 మేలో అయితే రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు నిర్వహించారు. 2022 మార్చి 11న చలో విజయవాడ నిర్వహించారు. ఆ సమయంలో పోలీసులు పెద్దఎత్తున నిర్బంధం ప్రయోగించారు. రోడ్లపై ఈడ్చేశారు తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఈ ఏడాది ఆగస్టులో ఆందోళన తీవ్రమైంది. కార్మికులు కలెక్టరేట్లను ముట్టడించారు. ఈ సమయంలో జరిగిన లాఠీఛార్జిలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపురం, కడప, నరసరావుపేట లాంటిచోట్ల కార్మికులను పోలీసులు తీవ్రంగా కొట్టారు. సుమారు 100 మందికిపైగా తీవ్ర గాయాలయ్యాయి. ఆగస్టు 10న మంత్రి చర్చలకు పిలిచి మరలా హామీలు గుప్పించారు. అవేమీ అమలు జరగలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్రలు జరిపి కార్మికులను సన్నద్ధం చేశారు. అదే సమయంలో కలిసివచ్చే ఇతర సంఘాలనూ కలుపుకుని ఆందోళన ఉధృతం చేశారు. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో 2023 డిసెంబర్ చివరివారం నుండి సమ్మె చేపట్టారు. దీంతో ప్రభుత్వం వారితో ఒకరోజు చర్చలు జరిపింది. సరైన ఫలితం లేకపోవడంతో సిఐటియు, ఎఐసిటియు నాయకులు కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై 30వ తేదీన ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. సిఐటియు అనుబంధ సంఘం మినహా మిగిలిన సంఘాలు సమ్మెలో పాల్గొనడం లేదని ప్రకటించారు. సిఐటియు అనుబంధ సంఘం కూడా సమ్మెను విరమించాలని కోరారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేది లేదని సంఘం ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మరోసారి మంత్రుల బృందం చర్చలకు ఆహ్వానించింది.



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు



ఒంగోలులో మంత్రి సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికులకు బెదిరింపులు

- మీ సంగతి తేలుస్తామంటూ హెచ్చరికలు
- పోటీ కార్మికులతో పని - విశాఖలో 80 మంది అరెస్టు
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులపై అధికారులు పలుచోట్ల బెదిరింపులకు దిగారు. సమ్మె ముగిసిన తర్వాత మీ సంగతి తేలుస్తామంటూ హెచ్చరిస్తున్నారు. మరికొన్ని చోట్ల పోటీ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. అడ్డుకున్న కార్మికులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారు. అధికారుల బెదిరింపులకు, అరెస్టులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ సమ్మె కొనసాగుతుందని కార్మికులు తెగేసి చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం వివిధ రూపాల్లో కార్మికులు నిరసన తెలిపారు.

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మున్సిపల్ కార్మికులపై కౌన్సిలర్లు బెదిరింపులకు దిగారు. సమ్మె ముగిసిన తర్వాత మీ సంగతి తేలుస్తామంటూ హెచ్చరించారు. బెదిరింపులకు భయపడేది లేదని కార్మికులు తెగేసి చెప్పారు. అనంతపురం కార్పొరేషన్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి పువ్వు ఇచ్చి కార్మికులు నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో ఎమ్మెల్యే శంకరనారాయణకు వినతిపత్రం అందజేశారు.

విజయవాడలో కార్మికుల సమ్మెకు సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులను రెచ్చగొట్టేలా నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేటర్లే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పోటీ కార్మికులను రంగంలోకి దింపి ప్రధాన రహదారుల్లో చెత్త కుప్పలు తరలించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. అనంతరం విఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఒంగోలులో మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కార్మికులు కలిసి.. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. విజయవాడలో సమావేశం నిర్వహించిన కార్మిక సంఘాలు ప్రతిపాదించిన 13 డిమాండ్లపై చర్చలు జరుపుతామని మంత్రి హామీ ఇచ్చారు. విశాఖలో జివిఎంసి లాసన్స్ బే కాలనీలో ఉన్న యార్డు వద్ద వాహనాలను ప్రయివేటు వ్యక్తులతో జివిఎంసి అధికారులు బయటకు తీయిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో 80 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద భోగి మంటలు వేసి 'మా కడుపు మంటలు తీర్చండి' అంటూ మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. పలాసలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం నుంచి మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో కార్మికులు ఒంటికాలిపై నిల్చొని, దండం పెడుతూ నిరసన తెలిపారు. పల్నాడు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో చేపట్టిన నిరవధిక సమ్మెలు కొనసాగుతున్నాయి. నెల్లూరులో స్వతంత్ర పార్కు నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ జారీ చేసిన నోటీసులను అక్కడే దగ్ధం చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఉమ్మడి కడప, నెల్లూరు, విజయనగరంలో ఆందోళనలు కొనసాగాయి.

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడి మృతి

విజయవాడ వాంబేకాలనీకి చెందిన మున్సిపల్ కార్మికుడు పిల్లి నరసింహారావు (55) గత 24 సంవత్సరాలుగా వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన మున్సిపల్ సమ్మెలో పాల్గొన్న నరసింహారావు సాయంకాలం ఇంటికి వెళ్లిన తర్వాత గుండెపోటుకు గురై మరణించారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.రెండు లక్షల నష్టపరిహారం చెల్లించాలని, మట్టి ఖర్చులు, పిఎఫ్ నిధులు వెంటనే ఇప్పించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోస్టు కార్డు ఉద్యమం

- సిఎంకు పోస్టుకార్డు ద్వారా సమస్యల గ్రీటింగ్
- 13వ రోజూ కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె



విశాఖలో పోస్టు కార్డులు చూపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సోమవారం పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగన్ బొమ్మలను చిత్రీకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టుకార్డులను పోస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఎ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరింది. పలువురు వక్తలు మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజు అయినా ఉద్యోగులు కుటుంబాలతో సంతోషంగా గడపకుండా నిరవధిక సమ్మె శిబిరంలో కూర్చునే దుస్థితి ముఖ్యమంత్రి కల్పించారని మండిపడ్డారు. ప్రకాశం జిల్లాలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. విజయనగరంలోని సమ్మె శిబిరంలో జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి కాంతారావు మాట్లాడుతూ మంత్రి బొత్స చర్చలు జరిపి ఎటువంటి పరిష్కారం చూపకుండా సమ్మెను విరమించాలని కోరడం సరికాదన్నారు. తాము ప్రభుత్వాన్ని కొత్తగా ఏమీ అడగలేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వం తమ వేతనాలు, రెగ్యులరైజేషన్ గురించి స్పష్టమైన హామీ ఇస్తే తప్ప సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి రాష్ట్ర చైర్మన్ ఎవి నాగేశ్వరరావు పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యల పరిష్కారం అయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. మంత్రుల కమిటీతో చర్చలు విఫలమయ్యాయని, ప్రభుత్వం పథకం రూపొందిస్తుందని, అందుకే అన్ని విభాగాల ఉద్యోగులు ఐక్యంగా ఉండి పోరాడాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్, రాష్ట్ర కౌన్సిల్ ఎం వాగ్దేవి, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతపురం, సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి, కర్నూలు జిల్లా, చిత్తూరు, తిరుపతి, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో, కృష్ణా జిల్లా, ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ, ఏలూరు, భీమవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం, విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అనకాపల్లి జిల్లాల్లో సమ్మె శిబిరాల్లో నిరసన తెలిపారు.

సమాజాన్ని మార్చాలంటే పుస్తకాలు చదవాలి

- మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఇంతియాజ్
- విజయవాడలో పుస్తక ప్రియుల పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న సిసోడియా

ప్రజాశక్తి - విజయవాడ ఎడ్యుకేషన్

సమాజాన్ని మార్చాలంటే పుస్తకాలు చదవాలని మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా సోమవారం 'పుస్తక ప్రియుల పాదయాత్ర' నిర్వహించారు. సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల వద్ద పాదయాత్రను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రకు ప్రముఖ విద్యావేత్త పరిమి నాయకత్వం వహించారు. పాదయాత్ర ఐదో నంబరు రోడ్డు మీదుగా పుస్తక మహోత్సవ ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం కేతు విశ్వనాథరెడ్డి సాహితీవేదికపై నిర్వహించిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికీ సమాజంపై తనదైన ముద్రవేయాలని, మంచి మార్పులు తేవాలని ఉంటుందని, కానీ ఆ ఆకాంక్షలను నిజం చేసుకోవాలంటే కావాల్సిన అవగాహన, మార్గదర్శనం మంచి పుస్తకాలలోనే లభిస్తాయని తెలిపారు. తాను ఐఎఎస్ అధికారి కావడానికి పుస్తకాలు చదివే అలవాటుండటమే కారణమని చెప్పారు. పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవడం ద్వారా పిల్లలు తమ జీవితాలను తాము కోరుకున్నట్లు మలుచుకోవచ్చని తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. పుస్తకం ఉన్న ఇల్లు విద్యాభివృద్ధికి నిలయమన్నారు. పిల్లలకూ పుస్తకాలకూ ఉన్న అనుబంధం మార్కులకూ, హోం వర్కులకూ పరిమితం చేయకూడదన్నారు. జాషువా, శ్రీశ్రీలాంటి కవుల రచనలు, మహాత్మాగాంధీ, అంబేద్కర్ జీవితాలను అధ్యయనం చేయాలని కోరారు. విద్యావేత్త పరిమి మాట్లాడుతూ.. కనీసం ప్రాథమిక పాఠశాల స్థాయి వరకూ అయినా మాతృభాషలో చదువుకునే అవకాశం లేకపోవడం తెలుగు పిల్లల దురదృష్టమన్నారు. పుస్తక మహోత్సవం వల్ల పుస్తకాలతో పిల్లలకు అనుబంధం పెంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ మాజీ అధ్యక్షులు వెంకట నారాయణ మాట్లాడుతూ.. రోజురోజుకూ పుస్తక పాఠకుల సంఖ్య తగ్గడం దురదృష్టమన్నారు. వ్యవస్థలో కీలకస్థానాల్లో ఉన్న వ్యక్తులు పుస్తకాలకున్న స్థానాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల సమాజానికి పరోక్షంగా చాలా నష్టం జరుగుతోందని చెప్పారు. మేధావులు, ప్రభుత్వాలు ఈ సమస్యను పట్టించుకుని పరిష్కారాలను ఆలోచించాలని కోరారు. పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షులు మనోహర్ నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్యపాల్గొన్నారు.

విశాఖ గ్యాంగ్ రేప్ ఘటనపై సమగ్ర దర్యాప్తు : మహిళా కమిషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ గ్యాంగ్ రేప్ ఘటన కేసును రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఘటన పూర్తి వివరాలపై నివేదిక ఇవ్వాలని కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ విశాఖ నగర పోలీస్ కమిషనరుకు సోమవారం లేఖ రాశారు. గ్యాంగ్ రేప్ ఘటనపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులకు కఠినశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత బాలిక వివరాల గోప్యత పాటించడంతోపాటు వైద్య సదుపాయం, రక్షణ కల్పించాలని విశాఖ పోలీస్ కమిషనరుకు సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు తక్షణం చెల్లించాలి

- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే ప్రభుత్వం ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటుచేయాలని ఎపి జెఎసి అమరావతి పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డిఎ, సరెండర్ లీవ్‌లు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ రిటైర్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం ఎపి జెఎసి అమరావతి, అనుబంధ సంఘాల కేలండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్ టివి ఫణిపేర్రాజు, కోశాధికారివి వి మురళీకృష్ణమ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, వైద్యసేవల కోసం ప్రభుత్వం కనీస ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు చనిపోయారని, ఆమాకుటుంబ సభ్యులకు ఇప్పటికీ ఉద్యోగం కల్పించలేదని సిఎస్ దృష్టికి తీసుకెళ్లారు.

పెన్షన్‌దారులకు రూ.30 వేలు చొప్పున ఎగవేత

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పి ఒక్కో పెన్షన్‌దారుడికి రూ.30 వేలు చొప్పున ఎగనామం పెట్టారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. అధికారంలోకి రాగానే పెన్షన్ రూ.3 వేలు ఇస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే ఏటా పెంపు అంటూ మాట మార్చారని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు 2019 నాటికి రూ.2 వేలుకు పెంచారని, 34 లక్షల మంది లబ్ధిదారులను 54.25 లక్షలకు పెంచారని వివరించారు. జగన్ రూ.750 పెంచి ఉద్ధరించానని చెప్పుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో పెన్షన్ మొత్తాన్ని ఎక్కడైనా తీసుకునే అవకాశముంటే, ఇపుడు కేవలం 15 కిలోమీటర్ల పరిధిలోనే ఉండాలంటూ జిఓలిచ్చారని విమర్శించారు.

మహిళలపై పెచ్చురిల్లిన అత్యాచారాలు : అనిత

విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి కారణంగా మహిళలపై అత్యాచారాలు పెచ్చరిల్లుతున్నాయని తెలుగు మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత విమర్శించారు. ప్రభుత్వం అనుకూలంగా ఉంటుందనే భరోసాతో వైసిపి అనుకూల రౌడీ గ్యాంగ్‌లు పెచ్చుమీరిపోతున్నాయని ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నివాసానికి సమీపంలో దళిత యువతి గ్యాంగ్ రేప్ కేసులో నిందితుడు వెంకట్‌రెడ్డిని ఇప్పటికీ అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సంపాదకీయం

అదానీ చెరలోకి అడవులు

అరణ్య ప్రదేశ్‌గా పేరుగాంచిన ఛత్తీస్‌గఢ్‌లోని అడవులను, సహజ వనరులను అస్మదీయుడైన అదానీకి కట్టబెట్టేందుకు బిజెపి తహతహలాడుతోందని ఆ రాష్ట్రంలో నెలకొన్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఇష్టారీతిన అక్రమ చెట్ల నరికివేత సాగుతోంది. ఈ విధ్వంసం అదానీ గ్రూపు బొగ్గు మైనింగ్‌కు మార్గం సుగమం చేసేందుకే! ఆదివాసీ ప్రాంతాల్లో బొగ్గు తవ్వకాలను అనుమతించడంపై గిరిజనుల, అటవీ వాసుల, పర్యావరణ కార్యకర్తల ఆందోళనలను తోసిరాజని బిజెపి ప్రభుత్వం అడవుల దురాక్రమణ దారులకు అండగా నిలబడింది. అటవీ విధ్వంసంపై ప్రశ్నిస్తున్న, నిరసిస్తున్న, ప్రతిఘటిస్తున్న ఆందోళన కారులను కిడ్నాప్‌ల వంటి చర్యలతో పాటు నిర్బంధాన్ని అమలు చేస్తోంది. జీవవైవిధ్య ప్రాంతం 'హస్‌దియో అరంద్'లో మైనింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులను పోలీసులే భయపెట్టారు. డిసెంబర్ 26న డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాత టి.జి. అజయ్‌ని, అటవీ వనరుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న 'ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్' కన్వీనర్ అలోక్ శుక్లాను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి ఆ తర్వాత వదిలేశారు. పోలీసులే కిడ్నాప్‌కు పాల్పడ్డారన్నది హక్కుల కార్యకర్తల ఆరోపణ.

ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న అపార బొగ్గు నిక్షేపాలపై మోడీ ప్రభుత్వ మద్దతు ఉన్న కార్పొరేట్లు కన్నేశారు. ప్రధానంగా అదానీ గ్రూపు మైనింగ్‌కు రంగంలోకి దిగింది. దాదాపు 37 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలను కబళించి తన సొంతం చేసుకోవడం అదానీ లక్ష్యం. బొగ్గు తవ్వకాల కోసం ముందటేడు వంద హెక్టార్లలో చెట్లను నేలమట్టం చేశారన్నది అధికారిక సమాచారం. వాస్తవంలో అంతకు ఎన్నో రెట్ల విధ్వంసం జరిగి ఉంటుంది. చెట్ల నరికివేత, బొగ్గు మైనింగ్ అత్యంత భద్రత మధ్య సాగుతోందంటే అక్రమాలకు ప్రభుత్వ మద్దతు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అడవుల నరికివేతకు వ్యతిరేకంగా గతేడాది రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అయినా ఆగింది లేదు. ఏజెన్సీలో మైనింగ్ వంటి కార్యకలాపాలకు రాజ్యాంగం ప్రకారం గ్రామ సభ ఆమోదం తప్పనిసరి. చాలా చోట్ల గ్రామ సభలు మైనింగ్‌ను వ్యతిరేకించాయి. కొన్ని చోట్ల కార్పొరేట్లే గ్రామ సభలను నిర్వహించి తమకనుకూలంగా తీర్మానాలు చేయించుకున్నారు. దీనిపై గత గవర్నర్ విచారణకు ఆదేశించారు కూడా. ఆదివాసీల హక్కులు, అటవీ హక్కులు, పర్యావరణ చట్టాల అమలు కోసం రాష్ట్రపతికి, రాష్ట్ర గవర్నర్‌కు ఆందోళనకారులు విన్నవించినా ఫలితం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలిచింది. విష్ణుదేవ్ రాష్ట్రానికి తొలి బిజెపి గిరిజన ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన హయాంలోనూ గిరిజనులకు అన్యాయమే ఎదురైంది. రాష్ట్రంలో కార్పొరేట్ రాజ్‌కు ఆయనే బాటలు వేస్తున్నారు.

గతేడాది మధ్యలో మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన అటవీ (పరిరక్షణ) సవరణ చట్టం కార్పొరేట్లకు విస్తృత మినహాయింపులు, ప్రయోజనాలు కల్పించగా, అడవులపై ఆధారపడ్డ గిరిజనులు, ఇతర అటవీ వాసుల హక్కులకు హాని తలపెట్టింది. ఈ భయాందోళనలను ఛత్తీస్‌గఢ్ పరిణామాలు నిజం చేశాయి. ప్రతిపక్షాలను, ఆదివాసీ హక్కుల సంఘాలను, పర్యావరణ, అటవీ హక్కుల కార్యకర్తల అభ్యంతరాలను, ఆందోళనలను లక్ష్యపెట్టకుండా మోడీ సర్కారు పార్లమెంట్‌లో బిల్లులు ఆమోదింపజేసుకుంది. మణిపూర్ నరమేధంపై బిజెపి ప్రభుత్వ వైఫల్యంపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తున్న సమయాన ఎటువంటి చర్చా లేకుండా, సెలెక్ట్ కమిటీ చర్చలను పరిగణనలోకి తీసుకోకుండా బిల్లులను ఆమోదింపజేసుకుంది. ఈ చర్య అదానీ, కార్పొరేట్ల కోసమేనని ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది. మన రాష్ట్రంలోని ఏజెన్సీలో బాక్సయిట్ తవ్వకాలు, పంప్డ్ విద్యుత్, పవన, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులూ అదానీ వశమవుతున్నాయి. దేశంలోని అడవులను, సహజ వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే క్రమంలో పర్యావరణ పరిరక్షణ, అడవులపై ఆధారపడ్డ గిరిజనుల, అటవీ వాసుల జీవనోపాధి మోడీ ప్రభుత్వానికి అప్రస్తుత విషయాలు. వామపక్ష తీవ్రవాదం, సరిహద్దు భద్రత, మౌలిక సదుపాయల కల్పన, ఎకో టూరిజం అమాంబాపతు మాటలన్నీ సాకులు మాత్రమే.

మహనీయుల మాట



ఏ మనిషీ
తన గతాన్ని
తిరిగి కొనగలిగేంత
ధనవంతుడు కాడు.
- ఆస్కార్ వైల్డ్

వలసాధిపత్యం లక్ష్యంగా విద్యావిధానం

ప్రజాప్రభాతం



ప్రభాత్ పట్నాయక్

కేవలం సాయుధ బలంతోనో లేక ఆర్థిక శక్తితోనో మాత్రమే సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాల మీద తన పెత్తనాన్ని సాగిస్తుందనుకోవద్దు. భావజాల రంగంలో సైతం తన ఆధిపత్యాన్ని నెలకొల్పి, తద్వారా తాను ఏ విధంగా కోరుకుంటోందో, అదేమాదిరిగా బాధిత దేశాల ప్రజలు ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా ప్రభావితం చేస్తుంది. అందుచేత మూడవ ప్రపంచ దేశాలలో స్వాతంత్ర్యం నెలకొనాలంటే ముందుగా ఆ దేశాల ప్రజల మనస్సుల మీద ఉన్న వలసాధిపత్యాన్ని వదిలించుకోవాలి. సామ్రాజ్యవాద వక్రీకరణల తెరలను చీల్చుకుని ఆ ప్రజలు వాస్తవం ఏమిటో గ్రహించగలగాలి. వలసవాద వ్యతిరేక పోరాటం ఈ వాస్తవాన్ని గుర్తించింది. నిజానికి ఈ చైతన్యం ఉదయించినప్పుడే ఆ పోరాటం మొదలైంది. ఐతే, రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినంత మాత్రాన సామ్రాజ్యవాద ఆధిపత్యం అంతటితో ముగిసిందని అనుకోరాదు. కొత్తగా స్వతంత్రం పొందిన దేశాల్లో సామ్రాజ్యవాదపు తప్పుడు భావజాల ప్రభావాన్ని అంతం చేసే విధంగా అక్కడ విద్యా వ్యవస్థ నిరంతరం పాటుపడాల్సి వుంటుంది.

ఇది జరగాలంటే మన దేశంలోని విద్యా వ్యవస్థల్లో బోధనాంశాలు, పాఠ్యాంశాలు సామ్రాజ్యవాద దేశాల్లోని విద్యా వ్యవస్థల్లో బోధించే వాటికి భిన్నంగా ఉండాలి. సాంఘిక శాస్త్రాలలో, భాష, లలిత కళలు తదితర అంశాలలో మన దేశ వర్తమానాన్ని అర్థం చేసుకోవాలంటే వలస పాలనలోని మన గతాన్ని, ఆ పాలన ఫలితాలను సక్రమంగా అర్థం చేసుకోవాల్సిందే.

ఐతే, సామ్రాజ్యవాద దేశాలలోని విశ్వవిద్యాలయాలు వలస పాలనకు సంబంధించిన గతంతో సంబంధం లేకుండా మన వర్తమానాన్ని వివరించడానికి పూనుకుంటాయి. మన దేశం వెనుకబడిపోడానికి కారణాలు మన సోమరిపోతు తనం అనో, మనకు వ్యాపార దక్షత లేకపోవడం అనో, మన మూఢవిశ్వాసాలు అనో, లేకపోతే మన అధిక జనాభా అనో చెప్తాయి. ఇక ప్రకృతి శాస్త్రాల విషయంలో కూడా మూడో ప్రపంచ దేశాల విశ్వవిద్యాలయాలలోని పాఠ్యాంశాలు సామ్రాజ్యవాద దేశాలలోని పాఠ్యాంశాలు ఒకే మాదిరిగా ఉండకూడదు. ఐన్‌స్టీన్ సిద్ధాంతంలోనో, క్వాంటం ఫిజిక్స్ లోనో సామ్రాజ్యవాద భావజాలం ఉందని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. సామ్రాజ్యవాద దేశాలలో శాస్త్రవిజ్ఞానం ప్రాధాన్యతలు, సవాళ్ళు వేరు. మూడవ ప్రపంచ దేశాలలో ప్రాధాన్యతలు, సవాళ్ళు వేరు. ఇరవయ్యో శతాబ్దపు ప్రముఖ మార్క్సిస్టు మేధావి, బ్రిటిష్ శాస్త్రవేత్త అయిన జెడి బెర్నాల్ అభిప్రాయం ఇది.

మూడవ ప్రపంచ దేశాల విశ్వవిద్యాలయాలలో కోర్సులు, పాఠ్యాంశాలు అచ్చం సామ్రాజ్యవాద దేశాల యూనివర్సిటీలలోని కోర్సుల మాదిరిగానే ఉండాలనుకోవడమే సామ్రాజ్యవాద భావజాలపు ఆధిపత్యానికి నిదర్శనం. నయా ఉదారవాద విధానాలకు పూర్వ కాలంలో మన దేశ విద్యావిధాన రూపకర్తలకు ఈ విషయం అవగాహనలో ఉంది. ఆ కాలపు విద్యా వ్యవస్థలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ, ఆ విధ్యావిధానపు దార్శనికతలో లోపం ఉందని చెప్పలేం.

నయా ఉదారవాద విధానాలు మొదలయ్యాక పరిస్థితులలో మార్పులు చోటు చేసుకోవడం మొదలైంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో భారత బడా బూర్జువావర్గం పెనవేసుకుపోవడం మొదలైంది. మన దేశంలోని ఉన్నత మధ్యతరగతి యువత బహుళజాతి కార్పొరేషన్లలో ఉద్యోగాలకోసం వెంపర్లాడడం పెరిగిపోయింది. విదేశీ మార్కెట్లకు సరుకులను ఎగుమతి చేయడం మీద, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం మీద అంతకంతకూ మన దేశాభివృద్ధి ఆధారపడడం మొదలైంది. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు సైతం మళ్ళీ ఈస్ట్ ఇండియా కంపెనీని మన దేశానికి ఆహ్వానించాలని సూచించేదాకా పోయారు.



నయా ఉదారవాదం అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం. ఈ ఆధిపత్యం ప్రపంచం అంతటా ఒకే విధంగా ఉండే సాంకేతిక యాజమాన్యంతో ముడిపడింది. అందుచేత ప్రపంచవ్యాప్తంగా ఒకేరూపంలో ఉండే విద్యా విధానం కావాలన్న వత్తిడి పెరిగింది. ఆ విధమైన విద్యావిధానం ఉంటేనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి కావలసిన సాంకేతిక నిర్వహణాధిపత్యం ప్రపంచమంతటా నెలకొల్పడం సాధ్యపడుతుంది. అటువంటి విద్యావిధానం సామ్రాజ్యవాద దేశాలలో తయారైందే అయివుండాలి. ఇప్పుడు విద్యావిధానం విద్యార్థుల మెదళ్ళను సామ్రాజ్యవాద ప్రభావం నుండి బైటకు తేవడం అనే లక్ష్యంతో కాకుండా, మళ్ళీ వారిని సామ్రాజ్యవాద బంటుల మాదిరిగా తయారుచేసే లక్ష్యంతో రూపొందుతోంది.

ఈ సంగతిని దృష్టిలో ఉంచుకునే గత యుపిఎ ప్రభుత్వం భారత దేశంలో తమ బ్రాంచీలను నెలకొల్పాలని విదేశీ యూనివర్సి టీలను ఆహ్వానిం చింది. మన దేశంలోని కొన్ని యూనివర్సిటీలను దత్తత తీసుకుని వాటిని విదేశీ యూనివర్సిటీల మాదిరిగా తీర్చిదిద్దా లని కోరింది. ఆ విధంగా ఇక్కడికి ఆహ్వానించబడిన ఆక్స్‌ఫర్డ్, హార్వార్డ్, కేంబ్రిడ్జ్ వంటి విదేశీ యూనివర్సిటీలు ఇక్కడి సిలబస్‌ను అనుసరించనవసరం లేదని, తమ తమ దేశాల్లో అమలు చేసే సిలబస్‌నే ఇక్కడ కూడా అమలు చేయాలని కోరింది. భారతీయ యూనివర్సిటీలలో, సామ్రాజ్యవాద దేశాలలోని యూనివర్సిటీలలో ఏకరూప బోధనాంశాలు, సిలబస్ లు ఉండేవిధంగా ఒక ప్రక్రియ మొదలైంది. అంటే వలసవాద భావజాలం నుండి బైటపడడానికి అంతవరకూ జరిగిన కృషిని తిరగదోడే క్రమం మొదలైంది. పార్లమెంటులో మన మానవ వనరుల అభివృద్ధిమంత్రి మన దేశంలో హార్వార్డ్ తరహా విద్యను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని, అటువంటి చదువులకోసం భారతీయ విద్యార్థులు విదేశాలకు పోవలసిన అవసరమే లేకుండా చేస్తామని ప్రకటించారు కూడా. యుపిఎ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రక్రియను ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చాక చాలా వేగంగా కొనసాగించింది. ఈ ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం సామ్రాజ్యవాద దేశాల విద్యా వ్యవస్థ మాదిరిగానే ఉండే వ్యవస్థను ఇక్కడ నెలకొల్పడం అనే భావనకు అధికారికంగా ముద్ర వేసింది. అంటే ఉమ్మడి బోధనాంశాలు, కోర్సులు ఇక్కడ నిర్వహించాల్సి వుంటుంది.

> **హిందూత్వ శక్తుల విషయానికి వస్తే వారేనాడూ స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములుగా లేరు. దేశ నిర్మాణం అనే విషయం వారికేనాడూ అర్థం కాలేదు, కాదు కూడా. సామ్రాజ్యవాదం ప్రభావం ఏమిటో, ఆ ప్రభావం నుండి మన ప్రజలను ఎందుకు బైటకు తీసుకురావాలో కూడా వాళ్ళకి బోధపడే విషయం కాదు. కేవలం మన ప్రాచీన కాలపు ఘన కీర్తి గురించి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసే చదువులు ఉంటే చాలు. అందుకే కోర్సులలో సామ్రాజ్యవాద భావజాలం నిండి వున్నా, దానితోబాటు కొంత వైదిక పరిజ్ఞానాన్ని జోడిస్తే చాలు వాళ్ళకి. ప్రస్తుతం మన దేశంలో అమలులోకి వస్తున్న విద్యావిధానం సరిగ్గా ఇటువంటిదే.**

విదేశీ యూనివర్సిటీల మాదిరిగా ఇక్కడ కూడా యూనివర్సిటీలను నిర్వహించడం కోసం రెండు నిర్ణయాత్మక చర్యలను తీసుకుంది. ఈ దేశంలో సామ్రాజ్యవాద భావజాల ఆధిపత్యానికి ప్రత్యామ్నాయాన్ని పెంపొందిస్తున్న యూనివర్సిటీలను నాశనం చేయడం మొదటి చర్య. ఈ చర్యలు అంతర్జాతీయ ప్రపంచపు దృష్టిలో కూడా పడ్డాయి. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ వంటివి ఇందుకు ఉదాహరణలుగా మనం చూడవచ్చు.

ఇక రెండవది: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ద్వారా వత్తిడి చేసి మన దేశంలోని యూనివర్సిటీలు దేనికదే విదేశీ యూనివర్సిటీలతో చర్చలు జరిపి విదేశీ యూనివర్సిటీలలోని కోర్సులనే ఇక్కడ మక్కీకి మక్కీగా అమలు చేయడం. ఒక్కటే తేడా ఏమంటే విదేశీ కోర్సులతోబాటు వేద గణితం వంటి కొన్ని కోర్సులను కూడా చేర్చాలని యుజిసి వత్తిడి చేస్తోంది. కొన్ని విదేశీ యూనివర్సిటీలు ఇందుకు ఒప్పుకోవడం లేదు. ఐతే త్వరలోనే ఇటువంటి విషయాల్లో కూడా ఒక అంగీకారం కుదురుతుంది. ఫలితంగా మన యూనివర్సిటీలలో నయా ఉదారవాదంతోబాటు హిందూత్వ భావజాలం కూడా కలగలిపిన కోర్సులు తయారౌతాయి. మన దేశం ప్రాచీన కాలంలో ఎంత ఘనకీర్తి కలిగివుందో తెలుసుకుంటూనే సామ్రాజ్యవాద భావజాల ఆధిపత్యంలోకి మన యువత మెదళ్ళు పోతాయి. అటువంటిదానికి సామ్రాజ్యవాదం పెద్దగా అభ్యంతరం చెప్పదు.

సామ్రాజ్యవాదం అంటే ఒక దోపిడీ వ్యవస్థ కాదని, భారతదేశం వంటి వెనుకబడిన దేశాలకు నవ నాగరికతను నేర్పే దయాహృదయంతో ఇక్కడికి వచ్చిందని, ఆ లక్ష్యం నెరవేరాలంటే సిలబస్‌లో, కోర్సులలో సామ్రాజ్యవాద యూనివర్సిటీలతో ఏకరూపత అవశ్యంఅని ఇక్కడ యువత తలల్లోకి ఎక్కితే చాలు. మన దేశపు ప్రస్తుత వెనుకబాటుతనానికి గతంలో సామ్రాజ్యవాదం సాగించిన దోపిడీ ప్రధాన కారణం అన్న విషయాన్ని మరుగుపరిస్తే చాలు. ఇక్కడి ప్రాచీన కాలపు ఘనకీర్తి గురించి ఎంత తెలుసుకున్నా దానివలన సామ్రాజ్యవాదానికి వచ్చిన ఇబ్బందేమీ ఉండబోదు.

వలసవాద మనస్తత్వాన్ని ఎక్కించుకునే ఈ క్రమంలో మరో ధోరణి కూడా ఉంది. సామాజిక శాస్త్రాలను, భాషా కోర్సులను మొత్తంగానే రద్దు చేయడమో లేక అప్రధానమైన కోర్సులుగా దిగజార్చడమో చేసి వాటి స్థానంలో పూర్తిగా ఉపాధి సాధన లక్ష్యంతో ఉండే మేనేజిమెంటు, కాస్ట్ అకౌంటెన్సీ వంటి కోర్సులను ప్రోత్సహించడం. అందువలన యువత సమాజం గురించి ఏ ప్రశ్నలూ అడగరు. ఈ విషయంలో అటు హిందూత్వ శక్తులకు, ఇటు కార్పొరేట్లకు ఉమ్మడి ప్రయోజనం ఉంది. వాళ్ళకి పూర్తిగా వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా ఉండే విద్యార్థులు, సామాజిక పరిణామాల గురించి ఎటువంటి ప్రశ్నలూ అడగనివారు కావాలి. ఈ ధోరణి కూడా ఇప్పుడు వేగంగా బలపడుతోంది. దేశంలో రాజకీయంగా కార్పొరేట్-హిందూత్వ శక్తులు ఏ విధంగా రాజకీయ ఆధిపత్యాన్ని సాధించాయో, దానికి ప్రతిరూపమే ప్రస్తుత విద్యావిధానం. ఇది మళ్ళీ మన ప్రజల మనస్సులను వలసాధిపత్యానికి లోబడేలా చేస్తుంది. కార్పొరేట్లు సరిగ్గా ఇదే కోరుకుంటున్నారు. ఇక హిందూత్వ శక్తుల విషయానికి వస్తే వారేనాడూ స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములుగా లేరు. దేశ నిర్మాణం అనే విషయం వారికేనాడూ అర్థం కాలేదు, కాదు కూడా. సామ్రాజ్యవాదం ప్రభావం ఏమిటో, ఆ ప్రభావం నుండి మన ప్రజలను ఎందుకు బైటకు తీసుకురావాలో అది కూడా వాళ్ళకి బోధపడే విషయం కాదు. కేవలం మన ప్రాచీన కాలపు ఘన కీర్తి గురించి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసే చదువులు ఉంటే చాలు. అందుకే కోర్సులలో సామ్రాజ్యవాద భావజాలం నిండి వున్నా, దానితోబాటు కొంత వైదిక పరిజ్ఞానాన్ని జోడిస్తే చాలు వాళ్ళకి. ప్రస్తుతం మన దేశంలో అమలులోకి వస్తున్న విద్యావిధానం సరిగ్గా ఇటువంటిదే.

ఈ కార్పొరేట్-హిందూత్వ కూటమి అనేది నయా ఉదారవాదంలో తలెత్తిన సంక్షోభం కారణంగా ఏర్పడింది. సంక్షోభం పెరుగుతున్న నేపథ్యంలో తమ ఆధిపత్యం కొనసాగాలంటే అందుకు హిందూత్వ శక్తుల తోడ్పాటు అవసరం అని కార్పొరేట్లు గుర్తించాయి. అదే మాదిరిగా, ప్రస్తుత జాతీయ విద్యావిధానం కూడా దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికి కాకుండా, సంక్షోభ కాలంలో తమ భావజాల ఆధిపత్యాన్ని కొనసాగించే లక్ష్యంతో రూపొందింది. అందుచేత ఈ విధానం భావాలను వికసించనివ్వకుండా నాశనం చేస్తుంది. ప్రశ్నలు లేవనెత్తనివ్వదు. సత్యాన్ని తెలుసుకోనివ్వదు. ఈ విధానం చాలా గొప్పగా చూపించే "ఉపాధి కల్పన లక్ష్యం" అనేది కొద్దిమందికి మాత్రమే లాభిస్తుంది. నిజానికి నయా ఉదారవాద సంక్షోభం పెరుగుతున్నకొద్దీ ఉపాధి అవకాశాలు తరిగిపోతాయి. దానికి అనుగుణంగానే ప్రస్తుత జాతీయ విద్యా విధానం అంతకంతకూ ఎక్కువమంది యువతను విద్యకు దూరం చేస్తుంది. మత విద్వేష విషంతో వారి మెదళ్ళను నింపి వాస్తవ జీవిత సమస్యలపై చర్చ జరగకుండా వారి దృష్టిని మళ్ళిస్తుంది. తమ ఫాసిస్టు గూండా దాడులలో పాల్గొనడానికి చౌకగా దొరికే కూలీలుగా వారిని వాడుకుంటుంది.

అందుచేత ఈ విద్యావిధానం చాలా స్వల్పకాలం మాత్రమే ఉనికిలో ఉండగలదు. ఈ దేశపు యువత తాము అనుభవిస్తున్న నిరుద్యోగం గురించి, దుర్భర దారిద్ర్యం గురించి, అటువంటి పరిస్థితి ఏర్పడడానికి కారణం గురించి ప్రశ్నలు అడగడం మొదలవగానే ఈ విద్యావిధానం చివరి ఘడియలు మొదలౌతాయి. నయా ఉదారవాద విధానానికి ప్రత్యామ్నాయంగా ఒక అభివృద్ధి పంథాను అన్వేషించడం మొదలవగానే, దానిలో భాగంగానే ప్రత్యామ్నాయ విద్యావిధానం ఎలా ఉండాలన్న అన్వేషణ కూడా మొదలౌతుంది. సామ్రాజ్యవాద భావజాలం నుండి బైటపడడం అనే ఎజెండా జాతీయోద్యమ కాలంలో వచ్చిన మాదిరిగానే మళ్ళీ ముందుకొస్తుంది.

(స్వేచ్ఛానుసరణ)

నైతిక ప్రమాణాలను కోల్పోయిన భారత్

సందర్భం



అరుంధతీ రాయ్

నేనీరోజు అత్యవసరమైన విషయం గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను. మన దేశం తన నైతిక ప్రమాణాలను కోల్పోయింది. అత్యంత హేయమైన నేరాలు, జాతి సంహారం, జాతి ప్రక్షాళనకు పిలుపునిచ్చే భయంకరమైన ప్రకటనలను రాజకీయ ప్రతిఫలాలతో స్వాగతిస్తున్నారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుండగా, పేదలకు రొట్టె ముక్కలు విసరడమనేది వారిని పేదలుగా మార్చే శక్తులకు మద్దతునివ్వడమే అవుతుంది.

నేడు మనల్ని తికమక పెట్టే చిక్కు సమస్య ఏమంటే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమను తాము నిర్వీర్యం చేసుకునే విధంగా ఓట్లు వేస్తున్నట్లు కనపడుతున్నారు. వారు అందుకుంటున్న సమాచారం ఆధారంగా వారు ఈ పని చేస్తున్నారు. ఆ సమాచారం ఏమిటి? దానిని నియంత్రించేదెవరు? ఎవరు సాంకేతికతను నియంత్రిస్తారో వారే ప్రపంచాన్ని నియంత్రిస్తారు. కానీ చివరికి, ప్రజల్ని ఎవరూ నియంత్రించలేరనీ, ఒక కొత్తతరం తిరుగుబాటు చేస్తుందని నేను నమ్ముతాను. అక్కడ ఒక విప్లవం వస్తుంది. క్షమించండి, విప్లవాలు వస్తాయి.

ఒక దేశంగా, మనం మన నైతిక ప్రమాణాలను కోల్పోయామని నేను అన్నాను. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు-యూదులు, ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు, కమ్యూనిస్టులు, నాస్తికులు గాజాలో తక్షణమే కాల్పులు విరమించాలనే పిలుపుతో ప్రదర్శనలు చేస్తున్నారు. కానీ ఒకప్పుడు వలస ప్రజలకు, పాలస్తీనాకు నిజమైన స్నేహితుడు, ఒకప్పుడు వేలాది మంది ప్రదర్శనలను చూసిన మన దేశంలోని వీధులు నేడు నిశ్శబ్దంగా ఉన్నాయి. చాలామంది మన రచయితలు, ప్రజా మేధావులు, అందరూ కాదు కానీ కొద్దిమంది కూడా మౌనంగా ఉండిపోయారు. ఎంతటి ఘోరమైన అవమానం! ఎంతటి ముందు చూపు లేని తనం! మన ప్రజాస్వామ్య నిర్మాణాలు క్రమ పద్ధతిలో కూల్చివేయబడడం, అపురూపమైన వైవిధ్యంతో కూడిన మన దేశం ఒకే విధమైన జాతీయవాదం అనే సంకుచిత ఆలోచనగా మారడం గమనిస్తుంటే, తమను తాము మేధావులుగా చెప్పుకునే వారు,మన దేశం కూడా ముక్కలవుతుందనే విషయాన్ని తెలుసుకోవాలి.

ఇజ్రాయిలీలు పాలస్తీనియన్లను నిర్దాక్షిణ్యంగా చంపడం గురించి మనం ఏమీ మాట్లాడకుంటే, మనం కూడా దానిలో భాగస్వాములమైనట్లే. మన నైతికతలో ఏదో ఒక మార్పు శాశ్వతంగా ఉంటుంది. ఇళ్ళు, ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు, పాఠశాలలు, యూనివర్సిటీలు, ప్రభుత్వ రికార్డులపై బాంబులు కురిపిస్తుండగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులైనప్పుడు, శిథిలాల కింద నుంచి ప్రాణాలు కోల్పోయిన పిల్లల్ని బయటకు లాగుతున్నపుడు, మనం సహాయం చేస్తున్నామా? గాజా సరిహద్దులు మూసివేయ బడ్డాయి. ప్రజలు ఎక్కడికీ వెళ్ళలేరు. వారికి గూడు, కూడు, నీళ్ళు లేవు. సగం కంటే ఎక్కువ జనాభా ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి చెప్తున్నది. అయినా వారిపై నిర్విరామంగా బాంబులతో దాడి చేస్తు న్నారు. ఒక జాతి హననాన్ని పట్టించుకోలేని స్థాయికి మొత్తం ప్రజల్ని అమానవీయంగా మార్చడాన్ని మరోసారి చూడబోతు న్నామా మనం? పాలస్తీనియన్లను అమానవీయంగా మార్చే ప్రణాళిక బెంజమిన్ నెతన్యాహుతో, అతని సిబ్బందితోనే మొదలు కాలేదు. అది దశాబ్దాల క్రితమే ప్రారంభమైంది.

2002, సెప్టెంబర్ 11న, 2001 మొదటి వార్షికోత్సవంలో నేను అమెరికాలో 'సెప్టెంబర్...రా...' (కమ్ సెప్టెంబర్) అనే ప్రసంగం చేశాను. దానిలో నేను ఇతర సెప్టెంబర్ 11 వార్షికోత్సవాల గురించి మాట్లాడాను. ఆ రోజున 1973లో చిలీలో అధ్యక్షుడైన సాల్వడార్ అలెండీకి వ్యతిరేకంగా సీఐఏ అండతో చేసిన తిరుగుబాటు గురించి, అదేవిధంగా 1990 సెప్టెంబర్ 11న అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ బుష్ సీనియర్, ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేయాలన్న తన ప్రభుత్వ ప్రకటనపై మాట్లాడాను. ఆ తరువాత నేను పాలస్తీనా గురించి మాట్లాడాను. ఆ భాగాన్ని చదువుతాను. అది నేను 21 సంవత్సరాల క్రితం రాసిన విషయమని నేను మీకు చెప్పకుంటే, అది ఈ రోజు గురించేనని మీరనుకుంటారు.

"సెప్టెంబర్ 11 మధ్య ప్రాచ్యంలో కూడా విషాద సంకేతం లాంటిది. 1922 సెప్టెంబర్ 11న అరబ్బుల ఆగ్రహాన్ని పట్టించుకోకుండా బ్రిటీష్ ప్రభుత్వం పాలస్తీనాలో ఒక ఆజ్ఞను జారీ చేసింది. సర్వోన్నతాధికారం గల బ్రిటన్ జారీ చేసిన 1917 బాల్ఫోర్ ప్రకటనను అనుసరించి, దాని సైన్యాన్ని గాజా గేట్ల బయట కేంద్రీకరించింది. బాల్ఫోర్ ప్రకటన, యూదు ప్రజల కోసం ఒక జాతీయ నివాసాన్ని ఇస్తామని యూరోపియన్ జియోనిస్టులకు హామీ ఇచ్చింది. ఆ సమయంలో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యానికి... జాతీయ మాతృభూములను లాక్కొని, స్వాధీనం చేసుకునే స్వేచ్ఛ ఉండేది. సర్వోన్నత అధికారం, ప్రాచీన నాగరికతలను అత్యంత నిర్లక్ష్యంగా బలిచేసింది. మానని రణాల వంటి పాలస్తీనా, కాశ్మీర్‌లు ఆధునిక ప్రపంచానికి సామ్రాజ్యవాద బ్రిటన్ ఇచ్చిన బహుమతులు. ఈనాడు రగులుతున్న అంతర్జాతీయ ఘర్షణలను పెంచేందుకే సృష్టించిన ఉద్రిక్త పునాదులు.

1937లో విన్‌స్టన్ చర్చిల్ పాలస్తీనియన్ల గురించి ఇలా అన్నాడు: "తాను అనుభవించలేని వాటిని ఇతరులకు కాకుండా చేసే వ్యక్తి తనకే ఆ హక్కు ఉంటుందనే విషయాన్ని నేను అంగీకరించను. ఉదాహరణకు అమెరికాలో రెడ్ ఇండియన్స్‌కు, ఆస్ట్రేలియాలో నల్లజాతి వారికి సంబంధించి పెద్ద తప్పు జరిగిందంటే నేను ఒప్పుకోను. ఒక బలమైన జాతి, ఉన్నత శ్రేణిలోని జాతి, ప్రాపంచిక జ్ఞానం గల జాతి ఆ రకంగా వచ్చి, వారి స్థానాన్ని ఆక్రమించడం ద్వారా ఈ ప్రజలకు తప్పు జరిగిందనే విషయాన్ని నేనొప్పుకోను." అదే, పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయిల్ రాజ్యం వైఖరిని ఏర్పరిచింది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి గోల్డా మెయిర్, "పాలస్తీనియన్లు ఉనికిలో లేరు" అని 1969లో అన్నారు. ఆమె వారసుడు, ప్రధానమంత్రి లెవీ ఎష్కోల్, "పాలస్తీనియన్లు ఏమిటి? నేను పాలస్తీనా వచ్చిన పుడు, 2 లక్షల 50 వేల మంది యూదేతరులు, ప్రధానంగా అరబ్బులు, బెడౌయిన్లు ఉండేవారు." అన్నాడు.

> **ఇజ్రాయిలీలు పాలస్తీనియన్లను నిర్దాక్షిణ్యంగా చంపడం గురించి మనం ఏమీ మాట్లాడకుంటే, మనం కూడా దానిలో భాగస్వాములమైనట్లే. మన నైతికతలో ఏదో ఒక మార్పు శాశ్వతంగా ఉంటుంది. ఇళ్ళు, ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు, పాఠశాలలు, యూనివర్సిటీల పై బాంబులు కురిపిస్తుండగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులైనప్పుడు, శిథిలాల కింద నుంచి ప్రాణాలు కోల్పోయిన పిల్లల్ని బయటకు లాగుతున్నపుడు, మనం సహాయం చేస్తున్నామా? గాజా సరిహద్దులు మూసివేయబడ్డాయి. ప్రజలు ఎక్కడికీ వెళ్ళలేరు. వారికి గూడు, కూడు, నీళ్ళు లేవు. సగం కంటే ఎక్కువ జనాభా ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి చెప్తున్నది. అయినా వారిపై నిర్విరామంగా బాంబులతో దాడి చేస్తున్నారు. ఒక జాతి హననాన్ని పట్టించుకోలేని స్థాయికి మొత్తం ప్రజల్ని అమానవీయంగా మార్చడాన్ని మరోసారి చూడబోతున్నామా మనం?**

"పాలస్తీనియన్లు రెండు కాళ్ల జంతువులు" అని ఒకరు, పాలస్తీనియన్లు అణగదొక్కాల్సిన "మిడతలు" అని మరొక ప్రధాని అన్నారు. ఇది రాజ్యాధినేతల భాష, ఇవి సామాన్యుల మాటలు కాదు.

భూమి లేని ప్రజల కోసం ప్రజలు లేని భూమి గురించిన భయంకరమైన కథనం అలా మొదలైంది. 1947లో ఐక్యరాజ్యసమితి పాలస్తీనాను విభజించి, పాలస్తీనా భూమిలో 55 శాతం జియోనిస్టులకు కేటాయించింది. సంవత్సరం లోపే వారు 76 శాతం భూమిని స్వాధీనం చేసుకున్నారు. 1948 మే 14న, ఇజ్రాయిల్ రాజ్యాన్ని ప్రకటించారు. ఈ ప్రకటన కొద్ది నిమిషాల తరువాత అమెరికా ఇజ్రాయిల్ ను గుర్తించింది. వెస్ట్ బ్యాంక్ ను జోర్డాన్‌లో కలిపారు. గాజా స్ట్రిప్, ఈజిప్ట్ మిలిటరీ నియంత్రణలోకి వచ్చింది. పాలస్తీనా, శరణార్థులుగా మారిన వందలాది, వేలాది మంది పాలస్తీనా ప్రజల మనసుల్లో, హృదయాల్లో తప్ప ఉనికిలో మాత్రం లేకుండా పోయింది. 1967లో ఇజ్రాయిల్ వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌లను ఆక్రమించింది. దశాబ్దాలుగా తిరుగుబాట్లు, యుద్ధాలు కొనసాగుతున్నాయి. వేల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. సంధులు, ఒప్పందాలపై సంతకాలు చేశారు. కాల్పుల విరమణ జరగాలని ప్రకటించారు, వాటిని ఉల్లంఘించారు. కానీ రక్తపాతం మాత్రం అంతం కాదు. పాలస్తీనా ఇప్పటికీ అక్రమమైన ఆక్రమిత ప్రాంతంగానే మిగిలింది. దాని ప్రజానీకం అమానవీయమైన పరిస్థితుల్లో బతుకుతున్నారు. వారు అక్కడ సామూహిక శిక్షలకు గురవుతూ, 24 గంటల కర్ఫ్యూలో మగ్గుతున్నారు. ప్రతీరోజు వారిని క్రూరంగా అవమానిస్తున్నారు. వారి ఇళ్ళు ఎప్పుడు కూల్చివేయబడతాయో, వారి పిల్లలపై ఎప్పుడు కాల్పులు జరుగుతాయో, వారి విలువైన చెట్లను ఎప్పుడు నరికివేస్తారో, వారి రోడ్లు ఎప్పుడు మూసివేస్తారో, ఆహార పదార్థాలు, మందులు కొనేందుకు మార్కెట్లకు వెళ్ళేందుకు ఎప్పుడు అనుమతిస్తారో వారికి అస్సలు తెలియదు. వారెలాంటి



గౌరవం లేకుండా, కనుచూపు మేరలో ఆశ కనిపించని స్థితిలో బతుకుతున్నారు. వారికి వారి భూములపై, వారి భద్రతపై, వారి కదలికలపై, వారి సమాచారంపై, వారి నీటి సరఫరాపై నియంత్రణ లేదు. తమ ఆగ్రహాన్ని అదుపు చేసుకోలేని పాలస్తీనా యువకులు తమను తాము మానవ బాంబులుగా మార్చుకొని, ఇజ్రాయిల్ వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో సంచరిస్తూ వారిని వారు ఆత్మాహుతి చేసుకుంటూ, సాధారణ ప్రజల్ని చంపుతూ, రోజువారీ జీవితంలో భయాన్ని నింపుతూ చివరికి రెండు సమాజాల అనుమానాలను, పరస్పర ద్వేషాన్ని కఠినతరం చేస్తున్నారు. ప్రతీ బాంబు దాడి పాలస్తీనా ప్రజలపై కనికరం లేని ప్రతీకారాన్ని, కష్టాల్ని ఆహ్వానిస్తోంది. అయితే ఆత్మాహుతి దాడి అనేది వ్యక్తిగత నిరాశతో కూడిన చర్య అవుతుంది, అది విప్లవ వ్యూహం కాదు.

ఈ పరిస్థితుల్లో శాంతియుతమైన, నిష్పాక్షిక పరిష్కారాన్ని కోరుతూ ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని ఇజ్రాయిల్‌తో పాటు అమెరికా ప్రభుత్వం నిరోధించింది. ఇజ్రాయిల్ చేసిన ప్రతి యుద్ధానికి అమెరికా మద్దతు పలికింది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేసినప్పుడు, పాలస్తీనియన్ల ఇళ్ళను ధ్వంసం చేసేది అమెరికా క్షిపణులే. ప్రతీ సంవత్సరం అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును (కొన్ని బిలియన్ డాలర్లను) ఇజ్రాయిల్ పొందుతున్నది.

నేడు పాలస్తీనా పౌరులపై ఇజ్రాయిల్ వేస్తున్న ప్రతి బాంబు, ప్రతి ట్యాంక్, ప్రతి బుల్లెట్ పైన అమెరికా పేరు ఉంటుంది. అమెరికా హృదయపూర్వక మద్దతు లేకుండా ఇంత జరగదు. డిసెంబర్ 8న, ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో కాల్పుల విరమణకు అనుకూలంగా 13 సభ్య రాజ్యాలు ఓటు వేసినప్పుడు ఏం జరిగిందో మనం చూశాం, అమెరికా దానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. నల్ల జాతి అమెరికన్ అయిన అమెరికా డిప్యూటీ అంబాసిడర్ ఆ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ చెయ్యి ఎత్తిన వీడియో చూస్తుంటే మనసు దహించివేస్తుంది. సామాజిక మాధ్యమంలో తీవ్ర విమర్శలు చేసిన కొందరు వ్యాఖ్యాతలు దీనిని పీకముడి సామ్రాజ్యవాదం (ఇంటర్ సెక్షనల్ ఇంపీరియలిజం) అన్నారు.

/ముగింపు తదుపరి సంచికలో/

(డిసెంబర్ 13న తిరువనంతపురంలో నిర్వహించబడిన పి.గోవింద పిళ్ళై అవార్డు కార్యక్రమంలో అవార్డు గ్రహీత అరుంధతీ రాయ్ ప్రసంగ పాఠం సంక్షిప్తంగా)

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

మణిపూర్ నివేదికపై ట్రైబల్ ఫోరమ్ ఆగ్రహం

ఇంఫాల్ : మణిపూర్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. సాయుధ దుండగులు, పోలీస్ కమాండోల మధ్య కాల్పులు జరిగాయి. అయితే ఈ సంఘటనపై అధికారులిచ్చిన నివేదికపై దేశీయ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ ఆగ్రహం వ్యక్త చేసింది. శనివారం కుకీ గ్రామంపై పోలీస్ కమాండోలు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి, మూడు నివాసాలను తగులబెట్టారని తెలిపింది. పోలీసుల దాడిపై విచారణ జరిపించాలని మరో కమ్యూనిటీ కుకీ ఇన్‌పి, సాదర్ హిల్స్ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాత్మక పరిస్థితులపై "ఫోరమ్ రిస్టోరేషన్ ఆఫ్ పీస్ ఇన్ మణిపూర్" ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు, చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సయోధ్య, నిజ నిర్ధారణ కమిటీని నియమించాలని డిమాండ్ చేసింది. గతేడాది మే 3 నుంచి కుకీ, మైతీల మధ్య సాగుతున్న హింసాకాండలో సుమారు 200 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు. శనివారం మధ్యాహ్నం 3.45కి సాయుధ దుండగులు పోలీస్ కమాండోలపై కాల్పులు జరిపారని, సాయంత్రం 5.30 వరకు కాల్పులు కొనసాగాయని, దీంతో జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించామని జిల్లా అధికారులు తెలిపారు. మోరే ఆకస్మిక దాడిలో 5వ ఇండియా రిజర్వ్ బెటాలియన్‌కు చెందిన ఓ రైఫిల్ మ్యాన్ జి.పొన్‌ఖమ్‌లుంగ్‌కి గాయాలయ్యాయని మణిపూర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

బ్యాంక్‌లకు చేరిన 97% పెద్ద నోట్లు

ముంబయి : ఇప్పటి వరకు బ్యాంక్‌లకు 97 శాతం విలువ చేసే రూ.2,000 నోట్లు బ్యాంక్‌లకు చేరాయని ఆర్‌బిఐ వెల్లడించింది. 2023 డిసెంబర్ 29వ తేదీ వరకు 97.38 శాతం తిరిగి బ్యాంకుల్లోకి వచ్చాయని తెలిపింది. పెద్ద నోటును ఉపసంహరించుకుంటున్నట్లు 2023 మేలో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి వరకు దాదాపు రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ.2వేల నోట్లు చెలామణిలో ఉన్నాయి. కాగా.. డిసెంబర్ 29వ తేదీ నాటికి రూ. 9,330 కోట్లు ఇంకా బ్యాంక్‌లకు రాకుండా మార్కెట్‌లో ఉండిపోయాయని ఆర్‌బిఐ వెల్లడించింది. కాగా.. 2023 మే 19వ తేదీ నాటికి అందుబాటులో ఉన్న రూ.2000 నోట్లలో 97.38 శాతం నోట్లు బ్యాంకుల వద్దకు చేరాయన్నారు. ఇప్పటికీ పెద్ద నోట్లకు లీగల్ గుర్తింపు ఉందన్నారు. గతేడాది అక్టోబర్ 7వ తేదీ వరకు అన్ని బ్యాంకుల్లో రెండు వేల నోట్లను డిపాజిట్లను స్వీకరించారు. ఆ తర్వాత నుంచి ఆర్‌బిఐ రీజినల్ ఆఫీసుల్లో మాత్రమే ఈ నోట్లను తీసుకుంటున్న విషయం తెలిసిందే.

గోల్డీ బ్రార్ ఉగ్రవాది

- హోంశాఖ ప్రకటన

న్యూఢిల్లీ: కెనడాలో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్‌ను కేంద్ర హోంశాఖ సోమవారం ఉగ్రవాదిగా ప్రకటించింది. గోల్డీ బ్రార్ పేరుమోసిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సహచరుడు. పంజాబ్‌కు చెందిన ప్రముఖ సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య తర్వాత గోల్డీ బ్రార్ కెనడాకు మకాం మార్చాడు. అతనిపై హత్య, హత్యాయత్నం, ఆయుధాల స్మగ్లింగ్ సహా దాదాపు 13 కేసులు నమోదయ్యాయి. అతనిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు సైతం జారీ చేసింది. సెప్టెంబర్ నెలలో గోల్డీ బ్రార్ పోలీసులపై సైతం దాడికి పాల్పడ్డాడు. ఇంతకుముందు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లఖ్‌బీర్ సింగ్ లాండాను ఉగ్రవాదిగా ప్రకటించిన విషయం తెలిసిందే.

డిసెంబర్‌లో రూ.1.65 లక్షల కోట్ల జిఎస్‌టి వసూలు

న్యూఢిల్లీ : గడిచిన ఏడాది డిసెంబర్ మాసంలో దేశంలో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు 10 శాతం పెరిగి రూ.1.65 లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయని ఆర్థిక శాఖ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2022 ఇదే డిసెంబర్‌లో రూ.1.50 లక్షల కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఏడో నెలలో జిఎస్‌టి వసూళ్లు రూ.1.60 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి. కాగా.. గడిచిన నవంబర్ నెలలోని రూ.1.68 లక్షల కోట్ల వసూళ్లతో పోల్చితే డిసెంబర్‌లో 2 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. వరుసగా పది నెలల్లోనూ రూ.1.50 లక్షల కోట్ల మార్క్ దాటడం విశేషం. 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో స్థూల జిఎస్‌టి వసూళ్లు 12శాతం పెరిగి రూ.14.97 లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయి.

2022 అదే సమయంలో రూ.13.40 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. 2023 డిసెంబర్‌లోని రూ.1,64,882 కోట్ల స్థూల జిఎస్‌టిలో సిజిఎస్‌టి కింద రూ.30,443 కోట్ల రాబడి నమోదయ్యింది. ఎస్‌జిఎస్‌టి కింద రూ.37,935 కోట్లు, ఐజిఎస్‌టి కింద రూ.84,255 కోట్లు చొప్పున వసూళ్లయ్యాయని ఆర్థిక శాఖ వెల్లడించింది.

'భీమా కొరేగావ్' అమరులకు ఘన నివాళి

పూణే : భీమా కొరేగావ్ యుద్ధ 206వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆ యుద్ధ వీరులకు ఘనంగా నివాళి అర్పించారు. పూణే సమీపంలోని జయ స్థంభ్ వద్ద మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, అంబేద్కర్ మనవడు, వంచిత్ బహుజన్ అఘాడి నాయకులు ప్రకాశ్ అంబేద్కర్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ఎంపి అమోల్ కోల్హే తదితర ప్రముఖులు, లక్షలాది మంది ప్రజలు నివాళి అర్పించారు. పుణే-అహ్మద్‌నగర్ రోడ్డులోని పెర్నే గ్రామం సమీపంలో ఉన్న జయ స్థంభ్ వద్ద పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. 1818 జనవరి 1న బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ, మరాఠా పీష్వా పాలకులకు మధ్య జరిగిన భీమా కొరేగావ్ యుద్ధానికి గుర్తుగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సుమారు 10 లక్షల మందికి పైగా సందర్శకులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

కేరళలో మెరుగైన జీవన ప్రమాణం

- దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే తన ప్రజలకు అండగా ఉంది
- ప్రతి పౌరుడి ప్రాథమిక అవసరాలకు హామీ ఇవ్వొచ్చని నిరూపించింది
- వ్యవసాయాభివృద్ధిలో భూ సంస్కరణల కీలక పాత్ర
- కేరళ మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ వామపక్ష ప్రభుత్వం తన ప్రజలకు దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన జీవన ప్రమాణాలను అందించగలిగిందని కేరళ మాజీ ఆర్థికశాఖ మంత్రి, ప్రఖ్యాత ఆర్థికవేత్త థామస్ ఐజాక్ అన్నారు. సోమవారం ఛండీగఢ్‌లోని సెక్టార్ 29 డి లోని భక్నా భవన్‌లో పంజాబీ డైలీ దేశ్ సేవక్ 29వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా థామస్ ఐజాక్ ప్రసంగించారు. ప్రస్తుత ఆర్థికాభివృద్ధిలో మన దేశంలోని ప్రతి పౌరుడికి ప్రాథమిక అవసరాలకు హామీ ఇవ్వొచ్చని కేరళ నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. తక్కువ స్థాయి ఆర్థిక వృద్ధిలో కూడా కేరళ ఉన్నత స్థాయిని ఎలా సాధించగలిగిందో ఆయన వివరించారు. శ్రేయస్సు అనేది వృద్ధిపై మాత్రమే కాకుండా అది ఎలా పునఃపంపిణీ చేయబడుతుందనే దానిపై ఆధారపడి ఉంటుందని, కేరళ సంక్షేమం దాని పునర్విభజన వ్యూహం ఫలితంగానే జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేరళ, జాతీయ సగటు మధ్య తేడాను వివరిస్తూ కొన్ని గణాంకాలను విశ్లేషించారు. కేరళలో అక్షరాస్యత 96.2 శాతం, శిశు మరణాలు 7, ప్రసూతి మరణాలు 43, ఆయుర్దాయం 76.4, లింగ నిష్పత్తి 1,082, తలసరి ఆదాయం రూ.2,16,749 ఉందని తెలిపారు. అదే జాతీయ సగటు చూస్తే అక్షరాస్యత 77.7 శాతం, శిశు మరణాలు 32, ప్రసూతి మరణాలు 113, ఆయుర్దాయం 70.9, లింగ నిష్పత్తి 945, తలసరి ఆదాయం రూ.1,45,680 ఉందని వివరించారు. జనాభా పెరుగుదలకు సంబంధించి జాతీయ సగటు 9.0కి ఉందని, కేరళలో ఇది కేవలం 5.2 అని



పంజాబీ డైలీ దేశ్ సేవక్ 29వ వ్యవస్థాపక దినోత్సవ సభలో మాట్లాడుతున్న థామస్ ఐజాక్

అన్నారు. జనన రేటు గణాంకాలు కేరళలో 12.2 ఉండగా, జాతీయ సగటు 16 అని చెప్పారు.

వ్యవసాయాభివృద్ధిలో భూ సంస్కరణలు కీలక పాత్ర

వ్యవసాయాభివృద్ధిలో భూ సంస్కరణలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. ఇంతకముందు 70 శాతం భూమి కేవలం 5 శాతం ప్రజలతో ఉండేది. ప్రజలు విద్యకు పెద్దపీట వేశారని వివరించారు. కేరళలో వడ్రంగి లేదా ప్లంబర్ అయినా కూడా సంపాదన కోసం విదేశాలకు వెళ్లేందుకు కమ్యూనికేషన్‌కు అవసరమయ్యే ఇంగ్లీషు చదవడం, రాయడం వచ్చునని తెలిపారు. 20 లక్షల మంది వలసదారులతో గల్ఫ్ దేశాల్లో ఉన్నవారు చెల్లింపులు వాటా జిఎస్‌డిపిలో 30 శాతం అని ఆయన వెల్లడించారు.

డైలీ దేశ్ సేవక్ మేనేజింగ్ డైరెక్టర్ సుఖ్విందర్ సింగ్ సెఖోన్ మాట్లాడుతూ.. 1920లో వార్తాపత్రిక ప్రచురితమైనపుడు బ్రిటీష్ ప్రభుత్వం పదే పదే ఆ వార్తాపత్రిక సంపాదకులను అరెస్టు చేయడంతో మూతపడాల్సి వచ్చిందని అన్నారు. కామ్రేడ్ హరి కిషన్‌సింగ్ సుర్జీత్ దాని ప్రచురణను పునరుద్ధరించడానికి చిత్తశుద్ధితో ఎలా ప్రయత్నించారో, చివరికి ఛండీగఢ్‌లోని దాని ప్రస్తుత ప్రాంగణంలో 1996 జనవరి 1 నుండి దాని ప్రచురణను ఎలా ప్రారంభించారో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దేశ్ సేవక్ మేనేజింగ్ కమిటీ సభ్యులు గురుదర్శన్ సింగ్ ఖాస్పూర్, భూప్ చంద్ చన్నో తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వర్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

భువనేశ్వర్ : రూ.6,225 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న భువనేశ్వర్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. త్రిసులియా వద్ద ఉన్న రతగడ లెంక వద్ద ఈ శంకుస్థాపన జరిగింది. త్రిసులియా నుంచి భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు వరకూ 26 కిలోమీటర్ల దూరం మేర ఈ మెట్రో రైల్ ప్రాజెక్టు జరగనుంది. ఈ ప్రాజెక్టులో 20 స్టేషన్లు ఉంటాయి. వచ్చే నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఒడిషా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శంకుస్థాపన సందర్భంగా త్రిసూలియా నుంచి భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు వరకూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రోడ్‌షో నిర్వహించారు.

30 అడుగుల కేరళ గవర్నర్ దిష్టిబొమ్మ దగ్ధం

- వర్సిటీలలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల నియామకంపై ఎస్‌ఎఫ్‌ఐ ఆగ్రహం

తిరువనంతపురం : వర్సిటీలలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను నియమిస్తూ విద్యావిధానాన్ని కాషాయమయం చేసేందుకు ప్రయత్నిస్తున్న కేరళ గవర్నర్ అరిఫ్ మహ్మద్ ఖాన్ తీరుపై ఎస్‌ఎఫ్‌ఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. నూతన సంవత్సరం సందర్భంగా కన్నూరు జిల్లా పయ్యంబలం బీచ్‌లో 30 అడుగుల ఎత్తులో గవర్నర్ దిష్టిబొమ్మను ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ స్టేట్ ప్రెసిడెంట్ అనుశ్రీ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. కన్నూరు జిల్లాలోని పయ్యంబలం బీచ్‌కు డిసెంబర్ 31న భారీ సంఖ్యలో జనాలు తరలివచ్చారు. అదే సమయంలో గవర్నర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ఆయన తీరును ఎండగట్టారు.




సంఘ్ పరివార్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను యూనివర్సిటీలలో నామినేట్ మెంబర్లుగా నియమిస్తూ, అన్ని వర్సిటీలను కాషాయికరణం చేస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు మండిపడ్డారు.

రష్యాతో బంధం నిరంతరం బలోపేతం

- జిన్‌పింగ్ ఉద్ఘాటన

బీజింగ్: రష్యాతో సంబంధాలను నిరంతరం బలోపేతం చేసుకోవడం, విస్తరింపజేయడం రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. గత మూడేళ్లలో చైనా-రష్యా ద్వైపాక్షిక సంబంధాలు, సమగ్ర వ్యూహాత్మక సమన్వయం బాగా మెరుగుపడ్డాయని ఆయన చెప్పారు. నూతన సంవత్సర ప్రారంభ సందర్భంగా పుతిన్, జిన్‌పింగ్ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా జిన్ పింగ్ మాట్లాడుతూ చైనా ప్రభుత్వం, ప్రజల తరపున పుతిన్‌కు, రష్యన్ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాల గురించి ప్రస్తావిస్తూ ఒక


అదివారం చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ నూతన సంవత్సర సందేశాన్ని ఇస్తున్న దృశ్యం

శతాబ్దంలో కనపడని మార్పులు గత దశాబ్దంలో కనిపించాయని అన్నారు. ప్రపంచ ఆర్థిక మాంద్యం, ప్రాంతీయ అస్థిర పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో తమ ఇరు దేశాల మధ్య సంబంధాలు ఆరోగ్యకరంగాను, సుస్థిరంగాను కొనసాగిస్తున్నాయని, 2023లో సరైన దిశలో పయనించాయని జిన్‌పింగ్ పేర్కొన్నారు. మాస్కో, బీజింగ్‌లో జరిగిన రెండు ఉన్నత స్థాయి సమావేశాల్లో ద్వైపాక్షిక సంబంధాలతో బాటు ఉమ్మడి ఆందోళన కలిగించే ప్రధాన అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై విస్తత ఏకాభిప్రాయానికి వచ్చామని చైనా నేత చెప్పారు.

వార్షిక ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణం షెడ్యూల్ కంటే ముందే 20వేల కోట్ల యుఎస్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకుందని అన్నారు. 2024-2025 చైనా -రష్యాల దౌత్య సంబంధాల స్థాపన 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి సాంస్కృతికోత్సవాలను నిర్వహించాలని తాము నిర్ణయించామని అన్నారు.

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మొహమ్మద్ యూనస్‌కి జైలుశిక్ష



ఢాకా : బంగ్లాదేశ్ కార్మిక చట్టాలను ఉల్లంఘించారంటూ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ప్రొఫెసర్ ముహమ్మద్ యూనస్ (83)ను కోర్టు సోమవారం దోషిగా నిర్ధారించింది. యూనస్‌తోపాటు ఆయన సంస్థ 'గ్రామీణ టెలికామ్'లో పనిచేస్తున్న ముగ్గురు సహోద్యోగులకు కూడా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ప్రాసిక్యూటర్ ఖుర్షీద్ అలామ్ ఖాన్ మీడియాకి తెలిపారు. అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్న నలుగురికి వెంటనే బెయిల్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలను వారు ఖండించారు. బంగ్లాదేశ్‌లో తాను స్థాపించిన 50కిపైగా వ్యాపార సంస్థల్లో ఏ సంస్థ నుండి లాభం పొందలేదని యూనస్ గతంలో వివరణనిచ్చారు. ఈ కేసు తప్పుడు, రాజకీయ ప్రేరేపితమైనదని ఆయన న్యాయవాదులు పేర్కొన్నారు. ఆయనను వేధించడం, అవమానించడమే ఈ కేసు ఏకైక లక్ష్యమని అన్నారు. కార్మిక చట్టాల ఉల్లంఘన కేసుతోపాటు అవినీతికి సంబంధించి సుమారు వంద ఆరోపణలను యూనస్ ఎదుర్కొంటున్నారు. యూనస్‌పై కొనసాగుతున్న న్యాయపరమైన వేధింపులను ఖండిస్తూ గతేడాది ఆగస్టులో అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా, ఐరాస మాజీ సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్ సహా 160 మంది ప్రముఖులు ఓ లేఖను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆయన భద్రత, స్వేచ్ఛపై ఆందోళన చెందుతున్నామంటూ సుమారు 100కి పైగా నోబెల్ బహుమతి గ్రహీతలు పేర్కొన్నారు. ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం తీసుకున్న రబ్బర్ స్టాంప్ నిర్ణయాలను బంగ్లాదేశ్ కోర్టులు అనుసరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలలో యూనస్ పట్ల ఉన్న ప్రజాదరణను, రాజకీయ అసమ్మతిని అణచివేసేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనస్‌పై క్రిమినల్ చర్యలు ఆయనపై అసమ్మతికి, రాజకీయ ప్రతీకారానికి చిహ్నమని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఆయనపై వేధింపులకు తక్షణమే ముగింపు పలకాలని గతేడాది సెప్టెంబర్‌లో పిలుపునిచ్చింది.

'ఉపాధి'కి ఆధారే ఆధారం !

అమలులోకి కొత్త విధానం • అనర్హులుగా తేలిన 34శాతం మంది జాబ్ కార్డు హోల్డర్లు

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆధార్‌తో అనుసంధానించి వేతనాలు చెల్లించే విధానం సోమవారం ప్రారంభమైంది. ఈ విధానంపై ఇప్పటికే పలు విమర్శలు వచ్చినప్పటికీ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేసింది. జాబ్ కార్డులతో ఆధార్ అనుసంధానం కాని కార్మికులకు ఇకపై వేతనాలు లభించే అవకాశం లేకుండా పోయింది. ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు కలిగిన వారిలో గత నెల 27వ తేదీ నాటికి 34.8% మందికి ఆధార్ నెంబరుతో అనుసంధానం జరగలేదు.

ఉపాధి హామీ పథకంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని గత సంవత్సరం జనవరి 30వ తేదీ నాడే తప్పనిసరి చేశారు. దీనిపై పలు విజ్ఞాపనలు అందడంతో గడువును ఐదుసార్లు పొడిగించారు. చివరికి సోమవారం నుండి ఆధార్ ఆధారిత చెల్లింపులు మొదలయ్యాయి. ఈ పద్ధతి కింద కార్మికుడి బ్యాంక్ ఖాతా, జాబ్ కార్డు... ఈ రెండూ ఆధార్‌తో అనుసంధానం కావాల్సి ఉంటుంది. ఈ ఖాతా భారత జాతీయ చెల్లింపుల కార్పొరేషన్ 'మ్యాపర్'తో కూడా అనుసంధానం కావాలి.

ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసినప్పటి నుండీ కార్మికుల జాబ్ కార్డుల తొలగింపు గణనీయంగా పెరిగింది. విద్యావేత్తలు, హక్కుల కార్యకర్తలతో కూడిన 'లిబ్‌టెక్ ఇండియా' కన్సార్టియం తెలిపిన వివరాల ప్రకారం గత 21 నెలలలో 7.6 కోట్ల మంది కార్మికులను ఈ వ్యవస్థ నుండి తొలగించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అందించిన సమాచారం ప్రకారమే డిసెంబర్ 27వ తేదీ నాటికి జాబ్ కార్డు హోల్డర్లలో 34.8% మంది తాజా చెల్లింపుల పద్ధతిని అనర్హులు అయ్యారు. గత మూడు ఆర్థిక సంవత్సరాలలో కనీసం ఒక్క రోజైనా పనిచేసిన కార్మికులలో 12.7% మంది ఇప్పటికీ చెల్లింపుల విధానంతో అనుసంధానం కాలేదు.

గ్రామీణ కుటుంబాలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకం ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా నీరుకారిపోతోంది. ఈ పథకానికి మంచి ఆదరణ ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిపై తగిన శ్రద్ధ చూపడం లేదు. 2023 బడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయింపులు కూడా గణనీయంగా తగ్గించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.89,400 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2023-24లో దానిని రూ.60,000 కోట్లకు కుదించింది.

సాంకేతికతను ఆయుధంగా ఉపయోగించడం ఆపాలి : కాంగ్రెస్

జనవరి 1 నుంచి ఉపాధి హామీకి ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్)ను తప్పనిసరి చేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. కోట్లాది మంది పేద ప్రజలు కనీస ఆదాయాన్ని కూడా సంపాదించకుండా చేయడానికి సాంకేతికతను మోడీ ప్రభుత్వం ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్) జైరాం రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ చెల్లింపుల్లో ఎబిపిఎస్‌ను తప్పనిసరి చేయడాన్ని కొత్త సంవత్సరంలో మోడీ ప్రభుత్వ 'క్రూరమైన కానుక' అని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం ఎలాంటి సంప్రదింపులు లేదా శాస్త్రీయ విధానాలను అమలు చేయలేదని పేర్కొన్నారు. ఎబిపిఎస్ తప్పనిసరి అనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



శిక్షల పెంపును నిరసిస్తూ ట్రక్ డ్రైవర్ల ఆందోళన

న్యూఢిల్లీ: హిట్ అండ్ రన్ చట్టం కింద శిక్షా కాలాన్ని, జరిమానాని విపరీతంగా పెంచడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లు నిరసనలు చేపట్టారు. కొత్త చట్టం ప్రకారం.. డ్రైవర్లు ప్రమాదం చేసి పారిపోయినందుకు, ప్రాణాంతక ప్రమాదాన్ని నివేదించకపోతే 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించబడుతుంది. ఇంతకుముందు.. ఐపిసి సెక్షన్ 304 ఎ (నిర్లక్ష్యం వల్ల మరణానికి కారణం), నిందితుడికి రెండేళ్ల వరకు జైలు శిక్ష ఉండేది. శిక్షా కాలాన్ని పెంచాలని కోరుతూ హర్యానాలోని జింద్‌లో ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు సోమవారం సమ్మెకు దిగగా, ఆటో డ్రైవర్లు కూడా కొత్త చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. కొత్త చట్టం తుగ్లక్ చర్య అని ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేంద్ర కపూర్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డ్రైవర్ డ్యూటీ కన్నా.. కూలి పనులు చేసుకోవడం మంచిదని అన్నారు. రోడ్డు ప్రమాదం చేసిన డ్రైవర్‌కు పదేళ్ల జైలు, ఏడు లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. డ్రైవర్‌కు అంత డబ్బు ఎక్కడి నుండి వస్తుందని రాజేంద్ర కపూర్ ప్రశ్నించారు. కొత్త చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలో ఎన్‌హెచ్-2పై ట్రక్కు డ్రైవర్లు ఆదివారం భారీ నిరసన చేపట్టారు.

సస్పెన్షన్‌ను గుర్తించం సంజయ్‌సింగ్ ధిక్కార స్వరం

- నేషనల్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తామని ప్రకటన

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) వివాదం సద్దుమణిగే అవకాశాలు ఇప్పట్లో కనిపించడం లేదు. డబ్ల్యూఎఫ్ఐ ప్యానెల్‌ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము గుర్తించమని సంజయ్ సింగ్ సోమవారం ప్రకటించారు. అలాగే తర్వలో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్‌ను తామే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. డిసెంబరులో జరిగిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో సంజయ్ సింగ్ అధ్యక్షతలోని ప్యానెల్ విజయం సాధించింది. అయితే సంజయ్ సింగ్ ఎన్నికను వ్యతిరేకిస్తూ రెజ్లర్లు ఆందోళనకు దిగడంతో సంజయ్ సింగ్ ప్యానల్‌పై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ డిసెంబరు 24న నిషేధం విధించింది. అలాగే భారత ఒలింపిక్ సంఘంతో డబ్ల్యూఎఫ్ఐ నిర్వహణ కోసం ఒక కమిటీని కూడా నియమించింది. ఫిబ్రవరి 2-5 తేదీల్లో జైపూర్‌లో సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తామని ఈ కమిటీ ప్రకటించింది. అయితే ఈ కమిటీని తాము గుర్తించమని, అలాగే తమపై నిషేధాన్ని కూడా గుర్తించమని సంజయ్ సింగ్ సోమవారం తెలిపారు. అడ్‌హాక్ కమిటీ నేషనల్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తే తాము సహకరించమని, తామే ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తామని సంజయ్ సింగ్ స్పష్టం చేశారు.

పూరీ ఆలయంలో డ్రెస్ కోడ్ తప్పనిసరి

పూరీ : ఒడిషాలోని పూరీ జగన్నాథుని ఆలయంలో సోమవారం నుంచి డ్రెస్ కోడ్‌ను తప్పనిసరి చేసినట్లు శ్రీ జగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జెటిఎ) ప్రకటనలో తెలిపింది. జనవరి 1 నుంచి సంప్రదాయ దుస్తులను ధరించినవారినే ఆలయంలోకి అనుమతిస్తామని తెలిపింది. మగవారు ధోతి, తువ్వాలు, మహిళలు చీరలు, సల్వార్ కమీజ్‌లు ధరించాలని విజ్ఞప్తి చేసింది. హాఫ్ ప్యాంట్లు, షార్ట్‌లు, చిరిగిన జీన్స్, స్కర్టులు, స్లీవ్‌లెస్ దుస్తులు ధరించిన వారికి అనుమతి ఉండదని తెలిపింది.

క్యూబా విప్లవ వార్షికోత్సవ సందర్భంగా పలు దేశాల నేతలు అభినందనలు

హవానా: క్యూబా విప్లవ వార్షికోత్సవం సందర్భంగా పలువురు నేతలు ఆ దేశ అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 1959 జనవరి1న ఫైడెల్ కాస్ట్రో నాయకత్వంలో క్యూబా విమోచన పోరాటం విజయవంతమైంది. నిరంకుశ బటిస్టా ప్రభుత్వాన్ని క్యూబా ప్రజలు భూస్థాపితం చేశారు. అప్పటి నుంచి ప్రతి యేటా జనవరి ఒకటో తేదీని క్యూబా జాతీయ దినోత్సవ రోజుగా పాటిస్తూ వస్తున్నారు. క్యూబా విప్లవ వార్షికోత్సవ సందర్భంగా అభినందనలు పంపిన వారిలో చైనా, రష్యా, వియత్నాం, లాటిన్ అమెరికా, దుబాయి, మాల్దీవులు తదితర దేశాల నేతలు ఉన్నారు.



దక్షిణ గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న విధ్వంసకాండను దర్పణం పడుతున్న చిత్రమిది. పక్కన పాలస్తీనా చిత్రకారుడు అమర్ అబో

కొత్త సంవత్సరంలోనూ ఇజ్రాయిల్ దాడులు

గాజా : కొత్త సంవత్సరం తొలి రోజున గాజాపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు కొనసాగాయి. గత 24 గంటల వ్యవధిలోనే ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో 156 మంది మరణించారని సోమవారం సాయంత్రం గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సెంట్రల్ గాజాలోని మఘజి రెఫ్యూజీ క్యాంప్‌లోని ఒక ఇంటిపై బాంబులతో దాడి చేయడంతో 15 మంది మరణించినట్లు తెలిపింది. ఇప్పటి వరకూ ఇజ్రాయిల్ దాడుల కారణంగా మొత్తంగా 21,978 మంది మరణించినట్లు పేర్కొంది. గాజా నుంచి 284 మంది పాలస్తీనీయుల్ని ఖాళీ చేయించినట్లు ఖతార్ తెలిపింది. ఎర్ర సముద్రంలో అమెరికా సైన్యం దాడుల్లో 10 మంది హౌతీలు మరణించి నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇరాన్ ఆ ప్రాంతానికి ఒక యుద్ధనౌకను పంపింది.

జపాన్‌లో ఘోర భూ కంపం

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని ఫురిమో కిషిండా కోరారు. మరింత విపత్తు సంభవించే అవకాశం ఉన్నదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. టీవీ స్క్రీన్లపై 'రన్..' అనే హెచ్చరిక సందేశాన్ని పదే పదే ప్రసారం చేశారు. భారతీయులకు అవసరమైన సమాచారం అందించేందుకు వీలుగా జపాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర కంట్రోల్ రూమును ఏర్పాటు చేసింది. 2011 మార్చిలో జపాన్ ఈశాన్య ప్రాంతంలో భూకంపం, సునామీ సంభవించాయి. ఆ తర్వాత తీవ్ర స్థాయిలో సునామీ హెచ్చరికలు జారీ కావడం ఇదే మొదటిసారి.

ఈ దేశాల్లో కూడా..

ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, రష్యా దేశాలు కూడా అప్రమత్తమై సునామీ హెచ్చరికలు జారీ చేశాయి. తూర్పు నగరాలైన వ్లాదివోస్తాక్, నఖోడ్కాలకు రష్యా హెచ్చరికలు జారీ చేసింది. షకాలిన్ దీవికి పశ్చిమాన ఉన్న కోస్తా ప్రాంతం నుండి ప్రజలను ఖాళీ చేయించాల్సిందిగా రష్యా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని టాస్ వార్తా సంస్థ తెలిపింది. దక్షిణ కొరియా తూర్పు తీరంలో సునామీ అలలు 3.3 మీటర్ల ఎత్తున ఎగిశాయి. వీటి తాకిడి పెరగవచ్చునని అధికారులు తెలిపారు.

జపాన్‌లోని భారత ఎంబసీల్లో హెల్ప్‌లైన్లు

ఈ పరిణామాలతో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. టోక్యో సహా ఇతర నగరాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయం, హైకమిషన్ కార్యాలయాల్లో పని చేసే అధికారులు, వారి కాంటాక్ట్ నంబర్లతో కూడిన ఓ అధికారిక ప్రకటనను విడుదల చేసింది.

యాకుబ్ టోప్నా +81-80-39301715, అజయ్ సేథీ +81-70-14920049, డీఎన్ బర్న్‌వాల్ +81-80-32144734, ఎస్ భట్టాచార్య +81-80-62295382, వివేక్ రాఠీ +81-80,32144722 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. లేదా sscons.tokyo@mea.gov.in, offfseco.tokyo@mea.gov.in అనే చిరునామాలకు ఇమెయిల్ చేయవచ్చు.



మీకోసం

వేపుడు కూరలు చేసేటప్పుడు నూనెలో చిటికెడు ఉప్పు వేస్తే నూనె ఎక్కువగా పీల్చదు.

జీవన సౌరభం

మనకు గల సత్తాను బట్టి మనల్ని మనం అంచనా వేసుకుంటాం. మనం చేసే పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.

చిలకమ్మా! చిలకమ్మా!




చిలకమ్మా చిలకమ్మా
చిటారు కొమ్మన చిలకమ్మా
ఆకుపచ్చని చిలకమ్మా
అందమైన చిలకమ్మా

రివ్వున ఎగిరే చిలకమ్మా
చక్కని పలుకుల చిలకమ్మా
ఎర్రని పెదవుల చిలకమ్మా
ఎంతో చక్కని చిలకమ్మా

ఆకాశంలో చిలకమ్మా
అందమైన చిలకమ్మా
చిలిపి పలుకుల చిలకమ్మా
రామచక్కని చిలకమ్మా

నీ రూపం అపురూపం
నీ పలుకు అద్భుతం
చిలక పలుకుల చిలకమ్మా
చిలక కొట్టుడు చిలకమ్మా

- ఎల్. ప్రఫుల్ల చంద్ర
6300546700



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ





భరత్ కుమార్,
7వ తరగతి,
బాలవికాస్
ఇంగ్లీష్ మీడియం హైస్కూల్,
కడప.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

హాయ్ నా పేరు అవ్నీ..

నేను పాలస్తీనా గాజా బాలుడిని





యూట్యూబర్ అవ్నీ.. ఫైల్ ఫోటో

యూట్యూబ్ వీడియోలు చూసే వయసు ఆ బాలుడిది. అయితే అందరిలా తెర ముందు ప్రేక్షకుడిలా కూర్చోలేదు. తెరపై కనిపించాలని లక్ష్యం పెట్టుకున్నాడు. జూన్ 2020లో సోషల్‌మీడియాలో యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించాడు. ప్రో ఎవల్యూషన్ సాకర్, కార్ రేసింగ్ గేమ్ బ్లర్, కౌంటర్ స్ట్రైక్ వంటి గేమింగ్ వీడియోలను అందులో పోస్ట్ చేశాడు. ఇప్పటివరకు పది వీడియోలు ఆ ఛానెల్లో ప్రసారమయ్యాయి. 'హాయ్ నా పేరు అవ్నీ ఎల్దూస్. పాలస్తీనా గాజాలో నేను నివసిస్తున్నాను. నా వయసు 12 ఏళ్లు. నా ఛానెల్‌ని ముందు పది వేలు, ఆ తరువాత లక్ష, వెంటనే 5 లక్షల మంది అనుసరించాలని కోరుకుంటున్నాను. ఆ లక్ష్యం చేరే వరకు మంచి మంచి వీడియోలు పోస్టు చేస్తూనే ఉంటాను. త్వరలో ఇంటర్వ్యూలు అప్‌లోడ్ చేస్తాను. మీకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించడమే నా ఛానెల్ లక్ష్యం. ప్రస్తుతం నా యూట్యూబ్ ఛానెల్‌ని అనుసరిస్తున్న వెయ్యిమంది వీక్షకులకు థాంక్స్' అని చిరునవ్వులు చిందిస్తూ, ప్రకాశవంతమైన ముఖంతో భవిష్యత్తుపై గంపెడు ఆశలతో చెప్పిన అవ్నీ ఇప్పుడు లేడు. అతడు మరణించి దాదాపు 100 రోజులు అవుతోంది.

అవ్నీ ఆ వీడియోని ఆగస్టు 2022లో పోస్టు చేశాడు. ప్రస్తుతం ఆ వీడియోకు 40 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఆ వీడియో మాత్రమే కాదు, అవ్నీ చేసిన మిగిలిన వీడియోస్‌కి లక్షల్లో వ్యూస్ ఉన్నాయి. ఇప్పుడు అతడి చానెల్ 1.5 మిలియన్లకు చేరువలో ఉంది. హృదయం ద్రవించే విషయమేమంటే ఇంతటి విశేష ఆదరణ సొంతం చేసుకున్న అవ్నీ ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధం మొదలైన అక్టోబరు 7 తొలి దాడిలోనే మరణించాడు. ఆ రోజు చనిపోయిన వేలాదిమంది చిన్నారుల్లో అవ్నీ ఒకడు. అతని కుటుంబంలోని 15 మంది కూడా ఆ దాడిలోనే హతులయ్యారు.

'ఎప్పుడూ ఉత్సాహంతో తిరిగే అవ్నీ మా కళ్ల ముందు లేడన్న నిజాన్ని మేము ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నాం. ఆ రోజు నా ఫోను ఛార్జింగ్ కోసం పెట్టాను. నెట్ ఆన్ చేశాను. నా స్నేహితుడి ఫేస్‌బుక్ ఖాతాలో నా సోదరుడి ఫొటో ప్రత్యక్షమైంది. దానికింద రెస్ట్ ఇన్ పీస్ అని రాసి వుంది. నా కళ్లు బైర్లు కమ్మాయి. ఆస్పత్రికి పరుగులు పెట్టాను. గుట్టలుగా పోగుచేసిన ఆ శవాల మూటల్లో నా అన్నను, అతడి కుటుంబాన్ని వెతుక్కోవాల్సి వచ్చింది. ఇంట్లో అందరూ చనిపోయారు. భవనం మొత్తం కూలిపోయింది. ఆ దారుణానికి ఎంతోమంది బలయ్యారు' అని ఆనాటి విషాద ఘటనను గుర్తుచేసుకున్నారు అవ్నీ మేనత్త ఆలా.

'అవ్నీకి కంప్యూటర్ అంటే చాలా ఇష్టం. అతడిని నేను ఇంజినీర్ అవ్నీ అని పిలిచేవాడిని' అంటూ ఆ దారుణం నుండి తృటిలో తప్పించుకున్న బంధువొకరు అవ్నీతో తన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

అతడి స్కూల్ టీచర్లలో ఒకరు అవ్ని ఫోటోను షేర్ చేస్తూ 'ఎన్నిటికీ మర్చిపోలేని చిరునవ్వు' అని కామెంట్ చేశారు.

'మమ్మల్ని క్షమించు. నువ్వు మరణించకముందే, మేం నిన్ను గుర్తించి ఉండాల్సింది' అని ఓ యూట్యూబర్ భావోద్వేగ భరిత పోస్టు షేర్ చేశారు. అవ్నీ యూట్యూబ్ ఛానెల్ ఇప్పుడు ప్రపంచమంతా వీక్షిస్తోంది. ఇంతటి ఆదరణ కావాలనే ఆ చిన్నారి కలలుగన్నాడు. ఆ ఆనందం తన స్నేహితులతో పంచుకోవాలని ఆశ పడ్డాడు. కానీ తను లేని ఈ ప్రపంచం ఆ విజయాన్ని విషణ్ణ హృదయాలతో పంచుకుంటోంది. ఆ విషాదానికి బలైన అవ్నీ లాంటి చిన్నారులను తలచుకొని రోదిస్తోంది.

పిల్లలకు 'ఎబిసి' జ్యూస్ ఇవ్వండి..

చలికాలంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పిల్లలకు అనారోగ్యం చేస్తుంది. తరచూ ఆరోగ్యం పాడవ్వకుండా ఉండాలంటే, పోషకాలతో కూడిన ఆహారంతో పాటు 'ఎబిసి' జ్యూస్ ఇవ్వడం మంచిది. ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్‌తో తయారుచేసే ఈ జ్యూస్ 'ఎ' నుండి 'జెడ్' వరకు అన్ని పోషకాల లోపాన్ని మాయం చేస్తుంది. ఈ జ్యూస్ తాగడం వలన పిల్లలకు ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయంటే..


బలమైన రోగనిరోధక శక్తి : విటమిన్ సి, విటమిన్ కె పుష్కలంగా ఉండే ఈ జ్యూస్‌ని తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా.. ఈ రసంలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి.

జీర్ణక్రియ కోసం : యాపిల్, బీట్‌రూట్, క్యారెట్‌లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఫైబర్ జీర్ణక్రియకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే శరీరంలో తయారయ్యే టాక్సిన్స్ పేరుకుపోకుండా, సులభంగా కరిగిపోతాయి.

కంటి చూపు మెరుగుపడుతుంది : ఈ జ్యూస్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉండడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. అంతేకాదు చర్మం నిగారింపుగా ఉంటుంది. చర్మాన్ని మాత్రమే కాకుండా మొత్తం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది.



రంగవల్లి





పి.బేబీ,
మురమళ్ల,
తూర్పుగోదావరి జిల్లా.

16 చుక్కలు 4 వరుసలు 4 వచ్చేవరకు


ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

గొప్ప బహుమతి ఇచ్చారు : ప్రభాస్




'సలార్‌పై మీరంతా చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు. ఈ సినిమా బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను సాధించటం మా టీమ్ అందరికీ మీరిచ్చిన బహుమతిగా భావిస్తున్నాం' అని హీరో ప్రభాస్ చెప్పారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ ప్రాజెక్టు కోసం పనిచేసిన ప్రతిఒక్కరూ నిరంతరం శ్రమించారు. అందుకే ఇంత గొప్ప అవుట్‌పుట్ వచ్చింది. ప్రేక్షకులంతా దీన్ని ప్రశంసిస్తుంటే మా అందరికీ మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. నేను ఖాన్సార్ భవిష్యత్తును నిర్ణయిస్తాను. మీరంతా నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా చేసుకోండి..సలార్‌ను ఆదరించినందుకు ధన్యవాదాలు' అని వివరించారు.

త్వరలో రకుల్ పెళ్లి?



నటి రకుల్‌ప్రీత్‌సింగ్ త్వరలో పెళ్లిచేసుకోతున్నారనేది సమాచారం. బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో తాను 2021 నుంచి రిలేషన్‌లో ఉన్నట్లుగా గతంలోనే ఆమె ప్రకటించిన విషయం తెలిసిందే. త్వరలో వీరు ప్రేమపెళ్లితో ఒక జంట కాబోతున్నారనేది నెట్టింట వైరల్ అవుతోంది. గతంలోనే ఇలాంటి ఊహాగానాలు రాగా సరైన సమయం వచ్చినప్పుడు తప్పకుండా వివాహం చేసుకుంటానని అప్పట్లో ఆమె స్పష్టతనిచ్చారు. ఇదిలావుండగా ఈ ఏడాది ఫిబ్రవరి 22న గోవాలోని ఓ ప్రముఖ రిసార్ట్‌లో రకుల్–భగ్నానీల పెళ్లి జరగనుందంటూ పలు ఆంగ్లపత్రికల్లో కథనాలు వచ్చాయి. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి పెళ్లి జరగనుందని సమాచారం. ఆ తర్వాత సినీ ప్రముఖులకు ప్రత్యేక విందు కూడా ఏర్పాటుచేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయనేది సారాంశం.



8న 'దేవర' గ్లింప్స్

ఎన్టీఆర్ నటిస్తున్న తాజా చిత్రం 'దేవర' నుండి త్వరలో గ్లింప్స్ విడుదలకానుంది. ఈ విషయం తెలియజేస్తూ కొత్త సంవత్సరం కానుకగా చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. జనవరి 08న చిత్రం నుండి గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు పోస్టర్‌లో ప్రకటించారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్‌గా చేస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. తొలిభాగం 2024 ఏప్రిల్ 5న విడుదల కానుంది.

సల్మాన్‌కు జోడీగా త్రిష



బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్‌తో 'ది బుల్' చిత్రంలో హీరోయిన్‌గా త్రిష నటించనున్నారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత ఆమె హిందీ పరిశ్రమలో అడుగు పెట్టనున్నారు. విష్ణువిర్ధన్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. కరణ్‌జోహార్ నిర్మాత. 'ఖట్టా మీఠా' తర్వాత హిందీలో అవకాశాలు వచ్చినా దక్షిణాది సినిమాలతో బిజీగా ఉండటంతో ఆమె తిరస్కరించారు. ప్రస్తుతం త్రిష విదా ముయార్చి, ఐడెంటిటీ సినిమాల్లో నటిస్తున్నారు.

అంజలి '... మళ్లీ వచ్చింది'



అంజలి ప్రధాన పాత్రలో నటిస్తోన్న కొత్త చిత్రం 'గీతాంజలి మళ్ళీ వచ్చింది'. కొత్త ఏడాది 2024 ప్రారంభం సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేస్తూ మేకర్స్ ఈ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆమె నటించిన 'గీతాంజలి' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాతో మలయాళ నటుడు రాహుల్ మాధవ్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో ఈ సీక్వెల్‌ను ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. అంజలి నటిస్తోన్న 50వ సినిమా ఇది. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

మార్చి 8న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'

విశ్వక్ సేన్ నటిస్తున్న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా నుండి తాజాగా కొత్త పోస్టర్ విడుదలైంది. ఈ స్పెషల్ పోస్టర్‌లో సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించారు. ఈ చిత్రానికి కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. 2024 మార్చి 8న ఈ చిత్రం విడుదలకానుంది. నేహా శెట్టి ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.



కేప్‌టౌన్‌కు టీమిండియా

రేపటినుంచి దక్షిణాఫ్రికాతో రెండోటెస్ట్





కేప్‌టౌన్: 2024 ఏడాదిలో తొలి మ్యాచ్ ఆడేందుకు టీమిండియా సిద్ధమైంది. కేప్‌టౌన్ వేదికగా జనవరి 3నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే రెండోటెస్టుకు గెలుపే ధ్యేయంగా టీమిండియా బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని భారత్ భావిస్తుంటే.. మరోవైపు ప్రోటీస్ మాత్రం క్లీన్ స్వీప్ చేయాలని వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలో రెండో టెస్టు కోసం టీమిండియా కేప్‌టౌన్‌లో అడుగుపెట్టింది. సోమవారం సెంచూరియన్ నుంచి ప్రత్యేక విమానంలో కేప్‌టౌన్‌కు చేరుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోను బిసిసిఐ ఎక్స్(ట్విటర్)లో షేర్ చేసింది. ఈ వీడియోలో కెప్టెన్ రోహిత్‌తో పాటు శ్రేయస్ అయ్యర్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్ వంటి ఆటగాళ్లు కన్పించారు.

ఇక ఈ మ్యాచ్‌లో టీమిండియా రెండు మార్పులతో బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్‌కు గాయం కారణంగా దూరమైన స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా.. ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో అతడు రెండో టెస్టుకు జట్టు సెలక్షన్‌కు అందుబాటులోకి వచ్చాడు. జడేజా తుది జట్టులోకి వస్తే అశ్విన్‌పై వేటు పడనుంది. అదే విధంగా తొలి టెస్టులో విఫలమైన పేసర్ ప్రసిద్ద్ కృష్ణ స్థానంలో ముఖేష్ కుమార్, ఆవేశ్ ఖాన్‌లకు తుది జట్టులోకి వచ్చే ఛాన్స్ ఉంది.

టెస్ట్, వన్డేలకు వార్నర్ గుడ్‌బై

పాకిస్తాన్‌తో మూడోటెస్ట్ చివరిదంటూ ప్రకటన




సిడ్నీ: ఆస్ట్రేలియా ఓపెనర్ ఓపెనర్ డేవిడ్ వార్నర్(37) కొత్త సంవత్సరంలో క్రీడాభిమానులకు ఓ ఝలక్ ఇచ్చాడు. టెస్ట్, వన్డే క్రికెట్‌లకు గుడ్‌బై చెబుతున్న సోమవారం ప్రకటించాడు. "కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలనే నిర్ణయించుకున్నట్లు, ఆస్ట్రేలియా క్రికెట్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో తన వంతు పాత్ర పోషిస్తానని, ఆసీస్ తరఫున ప్రతి చిన్నారి ఆడేలా స్ఫూర్తిగా నిలిచానని భావిస్తున్నానని" తెలిపాడు. భారత్ వేదికగా జరిగిన ఐసిసి వన్డే ప్రపంచకప్‌ను ఆసీస్ జట్టు రికార్డుస్థాయిలో 6వ సారి కైవసం చేసుకున్న జట్టులో వార్నర్ కీలకపాత్ర పోషించాడు. ఇక పాకిస్తాన్‌తో సిడ్నీ వేదికగా బుధవారం నుంచి జరిగే 3వ టెస్ట్‌తో కెరీర్‌లో 112వ టెస్ట్ ఆడనున్నాడు. అలాగే జనవరి 20 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు జరగనున్న ఇంటర్నేషనల్ లీగ్ టి20 ఫ్రాంచైజీ దుబాయ్ క్యాపిటల్స్ తమ కెప్టెన్‌గా డేవిడ్ వార్నర్‌ను నియమించుకొన్నట్లు ప్రకటించింది. ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు డేవిడ్ వార్నర్ గతంలో కెప్టెన్‌గా వ్యవహరించాడు.

చివరి టెస్టులో సెంచరీ కొట్టాలి: సిడ్నీ మైదానం క్యురేటర్

సిడ్నీ క్రికెట్ మైదానంలో పాకిస్తాన్‌తో జరిగే టెస్ట్ చివరిదంటూ ప్రకటించిన వార్నర్‌పై ఎస్‌సిజి క్యురేటర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "డేవిడ్ వార్నర్ చాలాకాలంపాటు జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. జట్టు కోసం చాలా కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. అతడిపట్ల మాకున్న గౌరవం అపారం. మా టీమ్ అంతా అతడి చివరి టెస్టులో సెంచరీ కోసం ఎదురు చూస్తోందని నాకు తెలుసు" అని ఎస్‌సిజి క్యురేటర్ ఆడమ్ లూయిస్ తెలిపాడు. తొలి టెస్టులో అద్భుతమైన శతకంతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ముంబయి రంజీజట్టు కెప్టెన్‌గా రహానే



ముంబయి: ముంబయి రంజీజట్టు కెప్టెన్‌గా అజింక్యా రహానే ఎంపికయ్యాడు. ముంబయి క్రికెట్ అసోసియేషన్ (ఎంసిఎ) సోమవారం ఓ ప్రకటనలో 15మందితో కూడిన జట్టును ప్రకటించింది. 2023 సీజన్‌లో ముంబయి ఎలైట్ గ్రూప్–బిలో 4వ స్థానంలో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించ లేకపోయింది. అలాగే సూర్యకుమార్ యాదవ్, పృథ్వీ షా అంతర్జాతీయ టోర్నీల్లో ఆడుతున్న దృష్ట్యా వీరిద్దరి పేర్లను పరిశీలించలేదు. ఎంసిఏ ఆ ప్రకటనలో పేర్కొంది. బీహర్‌తో 5నుంచి, ఆంధ్రతో 12 నుంచి ముంబయి రంజీ మ్యాచ్‌లు ఆడనుంది.

జట్టు: రహానే(కెప్టెన్), బిస్టా, లాల్వాణి, టమోరె, సర్ఫరాజ్, దూబే, పార్కర్, పవార్, ములానీ, కోటియన్, దేశ్‌పాండే, మోహిత్, కులకర్ణి, డియాస్, అంకొలేకర్.

టైటాన్స్ చిత్తు చిత్తుగా..

పుణేరి చేతిలో 54-18తో ఓటమి

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్–10లోనూ తెలుగు టైటాన్స్ ఆటతీరు మారలేదు. గత సీజన్‌లో పేలవఫామ్‌తో అట్టడుగు స్థానంలో నిలిచిన టైటాన్స్.. ఈ సీజన్‌లో భారత కబడ్డీ జట్టు కెప్టెన్ రాకతోనూ ఏమాత్రం పుంజుకోలేకపోయింది. కొత్త సంవత్సరంలో తొలిరోజు పుణేరి పల్టన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు 18–54పాయింట్ల తేడాతో చిత్తుగా ఓడింది. గతంతో జైపూర్ మ్యాచ్‌కు దూరమైన పవన్ షెహ్రావత్ బరిలోకి దిగినా.. కేవలం 2పాయింట్లతో మాత్రమే మెరిసాడు. అజిత్, రాబిన్, హమిద్ కూడా నిరాశపరచారు. ఇక పుణేరి జట్టులో మోహిత్(13), అస్లామ్(8), అభినేశ్(5) రాణించారు. ట్యాకిల్స్‌లో గౌరవ్(6), మహ్మద్(5) రాణించారు. ఈ ఓటమితో తెలుగు టైటాన్స్ 9మ్యాచుల్లో ఓ గెలుపు 8 ఓటములతో సహా 8పాయింట్లతో 12వ(ఆఖరి) స్థానంలో కొనసాగుతోంది.

గెలుపుతో పునరాగమనం

బ్రిస్బేన్ టోర్నీ తొలిరౌండ్‌లో ఒసాకా విజయం



బ్రిస్బేన్: బ్రిస్బేన్ టెన్నిస్ టోర్నీలో జపాన్ టెన్నిస్ సంచలనం నవోమి ఒసాకా గెలుపుతో పునరాగమనం చేసింది. ఏడాది తర్వాత రాకెట్ పట్టిన ఒసాకా.. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో 6–3, 7–6(9–7)తో టమారా కోర్పాచ్(జర్మనీ)ను చిత్తుచేసింది. అనంతరం 28ఏళ్ల ఒసాకా మాట్లాడుతూ.. భయపడుతూనే కోర్టులోకి దిగానని, తొలి రౌండ్‌లో గెలుపు సంతృప్తినిచ్చిందని పేర్కొంది. 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మధ్యలోనే అర్ధాంతరంగా ఒసాకా.. జపాన్ ఆటగాడు రాఫర్ కోర్డేను వివాహం చేసుకొని ఓ కుమార్తెకు జన్మనిచ్చింది. రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్, ఒకసారి యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను నెగ్గింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68